విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





అనకాపల్లి | సంపుటి: 3 | సంచిక: 321 | శుక్రవారం | 25-04-2025 | ఎడిటర్ : చింతమనేని అనీల్ కుమార్ | పేజీలు : 8 | వెల : 3.00


## ప్రధానిని ఆహ్వానించనున్న చంద్రబాబు దంపతులు



**అమరావతి పెన్ సత్తా :** కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. అమరావతి, పోలవరం ప్రాజెక్టు లకు కేంద్రం మద్దతుగా నిలుస్తోంది. అమరావతి పున ప్రారంభ పనుల శంకుస్థాపన కోసం ప్రధాని మోదీ మే 2 న ఏపీ కి రానున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన సతీమణి భువనేశ్వరి తో కలిసి ప్రధాని మోదీ ని కలవటం ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు (శుక్రవారం) దిల్లీ వెళ్లనున్నారు. ప్రధానితో భేటీ అవుతున్నారు. ఈ సారి చంద్రబాబు తన సతీమణి భువనేశ్వరితో సహా ప్రధానితో సమావేశం కావటం ఆసక్తి కరంగా మారింది. అమరావతి పనుల రీ లాంఛ్ కోసం మే 2 న మోదీ ఏపీ పర్యటన ఖరారైంది. ప్రధాని పర్యటన ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. భారీ ఏర్పాట్లు చేస్తోంది. దీంతో ప్రధాని మోదీ ని, సతీ సమేతంగా వెళ్లి ఆహ్వానించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. ఇందు కోసం నేడు (25 వ తేదీ)న దిల్లీ లో ప్రధాని మోదీ తో సమావేశం కానున్నారు. దాదాపు లక్ష కోట్ల విలువైన పనులకు ప్రధాని శంకుస్థాపన చేసేలా ఏపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రేపు సాయంత్రం 4.30 గంట లకు ప్రధానితో అప్పాయింట్ మెంట్ ఖరారైంది. మే 2 న ప్రధాని మోదీ అమరావతి పర్యటన వేళ రోడ్ షో తో పాటుగా భారీ బహిరంగ సభకు ఏపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. తాజాగా ప్రధాని పర్యటన వేళ ఏర్పాట్లను మంత్రి నారాయణ క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. ప్రధాని చేతుల మీదగా లక్ష కోట్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. 5 లక్షల మంది ప్రజలు ప్రధాని సభకు హాజరవుతారన్నారు. నేషనల్ హైవే,కు కనెక్ట్ చేసే రోడ్ల గుర్తింపు, 11 పార్కింగ్ ప్లేస్‌లు గుర్తించామన్నారు. 8 రోడ్ల ద్వారా బహిరంగ సభ వేదికకు చేరుకోవచ్చని తెలిపారు. భద్రతాపరంగానూ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ప్రధాని అమరావతికి చేరుకో గానే రోడ్ షో నిర్వహిస్తారని మంత్రి నారాయణ వెల్లడించారు. సభాప్రాంగణంలో మూడు వేదికలు ఏర్పాటు చేస్తామని, ఒక వేదిక మీద 30 మంది రాజధాని రైతులు, మహిళలు, రాజధాని పరిరక్షణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబ సభ్యులు ఉంటారని అన్నారు. హెలిప్యాడ్ నుంచి సభావేదిక వరకు 1.1 కిలో మీటర్ల మేర ప్రధాని రోడ్ షో ఉంటుందని తెలిపారు. అమరావతిని నేషనల్ హైవేకి అనుసంధానం చేసే ఈ -13, ఈ -15, ఈ -11, సీడ్ యాక్సిస్ రహదారి పనులు పూర్తిస్థాయిలో కానందున ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఇతర రహదారులను పరిశీలించారు. మే 2 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పీఎం మోదీ గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సభాప్రాంగణం వద్దకు వస్తారని మంత్రి తెలిపారు.

## మధు సూదన్ కుటుంబాన్ని పరామర్శించిన పవన్



**నెల్లూరు పెన్ సత్తా :** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో 27 మంది ప్రాణాలు కోల్పోవడం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. వీరిలో రాష్టానికి చెందిన మధు సూదన్ రావు కూడా ఒకరు. ఆయన మృతదేహాన్ని గురువారం ఉదయం కావలికి తీసుకొచ్చారు. ఈ క్రమం లోనే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధు సూదన్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. కాగా నెల్లూరు జిల్లా లోని కావలికి వెళ్లి పవన్ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, అధైర్య పడొద్దని ప్రభుత్వం తరపున అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కావలిలో ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. మధు సూదన్ పార్ధి వదేహం చూసేందుకు ప్రజలు భారీగా చేరుకుంటున్నారు. అంత్యక్రియల ఏర్పాట్లను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పర్యవేక్షిస్తుండగా, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరి నారాయణ భౌతిక కాయానికి నివాళి అర్పించారు. అంత్యక్రియలలో జిల్లా లోని ఎమ్మెల్యేలు, అధికారులు, ముఖ్య నేతలు పాల్గొంటున్నారు. కావలిలో ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. మధుసూదన్ పార్ధివదేహం చూసేందుకు ప్రజలు భారీగా చేరుకుంటున్నారు. అంత్యక్రియలలో జిల్లా లోని ఎమ్మెల్యేలు, అధికారులు, ముఖ్య నేతలు పాల్గొంటున్నారు.



## రూపాయికి ఇడ్లీయే రాదు,కానీ ఆంధ్రాలో భూమీ దొరుకుతుంది జగన్



**తాడేపల్లి పెన్ సత్తా :** ఉర్సా భూ కేటాయింపుల పై మాజీ సీఎం జగన్ ధ్వజం కూటమి ప్రభుత్వంలో భూ కేటాయింపు లపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో భూ కేటాయింపు లపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విశాఖలో వేల కోట్ల రూపాయల భూములను కారు చౌకగా కట్టబెడుతున్నారని మండిపడ్డారు. రూపాయికి ఇడ్లీ అయినా వస్తుందో లేదో తెలియదు కానీ, ఉర్సా లాంటి కంపెనీలకు మూడు వేల కోట్ల విలువైన భూములు దోచి పెట్టారని ఆరోపించారు. అదే విధంగా లులు మాల్ పేరిట ఎలాంటి టెండర్లు లేకుండా రూ.1,500 కోట్ల భూ సంతర్పణ చేశారని జగన్ మండిపడ్డారు. తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో స్థానిక సంస్థల ప్రతినిధులతో మాజీ సీఎం జగన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ విధానాల పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. రాష్ట్రంలో ఎక్కడి కక్కడ బెల్టు షాపులు, మద్యం దుకాణాలు వెలిశాయని, మద్యం విచ్చలవిడి అమ్మకాలు చేస్తున్నారని మండి పడ్డారు. ప్రతి బాటిల్ పైన రూ.20 అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఉచిత ఇసుక పేరుతో రెండింతలు ఎక్కువ దోచేస్తున్నారని చెప్పారు. ప్రజల దృష్టి మళ్లించడానికి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని చెప్పిన జగన్ హామీలు అమలు చేయని టీడీపీ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీస్తున్నారని చెప్పారు. టీడీపీ నేతలు ధైర్యంగా గ్రామాల్లో తిరగలేకపోతున్నారని తెలిపారు. విద్య, వైద్య రంగాలను దారుణంగా మార్చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో నాలుగు లక్షల పింఛన్లను తీసేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ప్రజా వ్యతిరేకతను అణిచివేయడం టీడీపీ ప్రభుత్వానికి సాధ్యం కాదని తెలిపారు. సమావేశానికి ముందు జమ్మూకశ్మీర్ లోని పహల్గామ్ లో ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం ప్రకటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి హతులకు నివాళులర్పించారు. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న భూ కేటాయింపు లపై జగన్ తొలిసారి మాట్లాడారు. ఇప్పటికే విశాఖలో ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కు భూ కేటాయింపు లపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు మాజీ సీఎం కూడా అదే విషయం పై మాట్లాడటంతో ప్రభుత్వం ఏం చెబుతుందనేది ఆసక్తికరంగా మారింది.

## పాకిస్థాన్ రేంజర్ల అదుపులో బిఎస్ఎఫ్ జవాన్



**న్యూ దిల్లీ :** బిఎస్ఎఫ్ జవానును పాకిస్థాన్ రేంజర్లు అదుపు లోకి తీసుకున్నట్లు అధికారిక వర్గాలు గురువారం ప్రకటించాయి. పంజాబ్ లోని ఫిరోజ్‌పూర్ సమీపంలో ప్రమాదశాత్తు అంతర్జాతీయ సరిహద్దును దాటారని, బుధవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగినట్లు పేర్కొన్నాయి. ఫెన్సింగ్ కు సమీపంలో స్థానిక రైతులకు భద్రత కల్పిస్తున్న సమయంలో అనుకోకుడా పాకిస్థాన్ భూభాగం లోకి అడుగు పెట్టాడని తెలిపాయి. బిఎస్ఎఫ్, పాకిస్థాన్ రేంజర్స్ సీనియర్ అధికారుల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నాయి. సమస్యను సామరస్యంగా పరిష్కరించే అంశాన్ని పరిశీలిస్తున్నారని ఆ వర్గాలు వెల్లడించాయి.

## పంచాయతీ డబ్బులు పంచాయతీకే ఖర్చు పెట్టాలి



**అమరావతి పెన్ సత్తా :** పంచాయితీల డబ్బులు పంచాయితీకే ఖర్చు పెట్టాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నేడు అమరావతిలో జరిగిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవానికి పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. పహల్గామ్ ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించి, సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ గ్రామాలు భారత దేశానికి పట్టు కొమ్మలు, గ్రామాలే స్వయం ప్రతిపత్తి కల వ్యవస్థలుగా ఏర్పడాలన్నారు. పల్లెల అభివృద్ధి చాలా కీలకం, కూటమి ఎవరి మీద కక్ష సాధించదు, పంచాయతీ డబ్బులు పంచాయ తీకే ఖర్చు పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయకత్వ మీద నమ్మకంతో డబ్బులు ఇవ్వకపోయినా పనులు చేసిన కాంట్రాక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఫైనాన్షియల్ ప్లానింగ్ లో కొంత కొరత ఉంది. అందువల్లే నిధుల విడుదల ఆలస్యం అయింది అన్నారు. గత ఐదేళ్ళలో జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం లాంటి సందర్భం చూడలేదు. ఏ పార్టీ గ్రామంలో ఉన్నా గ్రామం గ్రామమే పార్టీలకు అతీతంగా పంచాయతీకి గౌరవం ఇచ్చాం అన్నారు. పంచాయితీ లను నిర్లక్ష్యం కాకుండా చూశాం, ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తూ సోషల్ ఆడిట్ చేశాం అన్నారు. ఉపాధి కూలీ అనే పదం మార్చి నరేగా శ్రామికులు, లేదా గ్రామ వికాస శ్రామికులు అనే పదం వాడాలని సూచించారు. కూలీ అని బ్రిటీషర్స్ తెచ్చిన తక్కువ చేసి చూసే పదం, కూలీ అనద్దు శ్రామికుడు అనండి, గ్రామ సభల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి పనులు చేశాం. 1,005 కోట్లతో 601 ప్రాంతాలకు 1,069 కిలో మీట్ల రోడ్లను అడవితల్లి బాటగా ఆమోదించాం. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ర్యాంకింగ్స్ లో 24 ర్యాంకు నుంచి 2 వ స్థానానికి మన రాష్ట్రాన్ని తీసుకొచ్చాం అని వెల్లడించారు. కలప మొక్కల పెంపకం చేయాలనే ప్రణాళిక చేశాం. కలపను దిగుమతి చేసుకునే విధానం మార్చి ఆదాయ వనరుగా, వాతావరణ పరిస్థితులు సరిగా ఉండేలా కలపను పెంచాలని చూస్తున్నాం అని పవన్ అన్నారు. కలప పెంపకం ద్వారా 20 వేల కోట్ల రూపాయల ఖర్చు తగ్గుతుందన్న ఆయన, స్థానిక సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా మార్చడం కోసం పని చేస్తున్నాం, రైల్వే కోడూరు ప్రాంతంలో ఒక గ్రామానికి అసలు రెవెన్యూ భూమి లేదు అని గుర్తించాం, పంచాయితీల భూములు, ఆస్తుల పై ఆడిట్ జరగాలి. ఈ విషయంలో ఎలాంటి రాజకీయ ఒత్తిడులు వచ్చినా నేను చూసుకుంటాను అన్నారు. కాశ్మీర్ లో అయినా ఎక్కడ ఏం జరిగినా గ్రామాలు కూడా పట్టించుకోవాలి. గ్రామాలు జాతీయ సమగ్రతకు పట్టుకొమ్మలు కావాలి. 13,326 పంపచాయితీ లలో జాతీయ సమగ్రతా ప్రాంగణం జాతీయ సమగ్రతా స్థూపం ఉండాలని స్పష్టం చేశారు. ఇక, కాశ్మీర్ లో మరణించిన వారి అంత్యక్రియలకు వెళ్లనున్నట్టు పవన్ కల్యాణ్ వెల్లడించారు.

## వితంతువు పెన్షన్ లు మంజూరు, జూన్ నుంచి కొత్తవి



**అమరావతి పెన్ సత్తా :** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్త పింఛన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భర్తను కోల్పోయిన వితంతువులను ఆదుకోవడం కోసం కొత్త వితంతు పెన్షన్లకు సీఎం ఆమోదం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే పెన్షన్ నెలకు రూ.4 వేలు చేసిన సంగతి తెలిసిందే. దివ్యాంగులకు సైతం నెల రూ.6 వేలు ఇస్తోంది. ఒకటో తేదీ ఉదయాన్నే ప్రభుత్వ అధికారులు ఏకంగా ఇంటి కొచ్చి మరీ పెన్షన్ అందజేస్తున్నారు. ఈ క్రమంలోనే కూటమి ప్రభుత్వం కొత్త పెన్షన్లకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు లక్ష కొత్త పెన్షన్లకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. భర్తను కోల్పోయిన వితంతువులను ఆదుకోవడం కోసం 89,788 కొత్త వితంతు పెన్షన్లకు ఆమోదం తెలిపారు. మే నెల మొదటి తారీఖు నుండి వీరందరికీ పెన్షన్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కొత్తగా ధరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్‌ను జూన్ నుండి అందజేస్తారు. 2014- 19 మధ్య టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పెన్షన్ నమోదు ప్రక్రియ నిరంతరాయంగా జరిగేది. లబ్ధిదారులు వారంలో ఏ రోజైన సరే పెన్షను దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. అధికారులు వాటిని ఏ వారానికి ఆ వారం పరిశీలించి నెలాఖరుకు పెన్షన్ జాబితాను సిద్ధం చేసేవారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారులకు ఆ మరుసటి నెల నుంచే పెన్షన్ పొందే అవకాశం ఉండేది. కానీ, 2019 లో అధికారం లోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి చెక్ పెట్టింది. ఆరు నెలలకు ఒకసారి మాత్రమే లబ్ధిదారుల జాబితాను రూపొందించే విధానం తీసుకొచ్చింది. ప్రతి ఏడాది జూన్, డిసెంబరు నెలల్లోనే జాబితా రూపొందిస్తామని తేల్చి చెప్పింది. అయితే, గడిచిన ఐదేళ్లలో ఒక్క సారి కూడా ఆ ప్రకారంగా జాబితాను రూపొందించిన దాఖలాలు లేవు. విద్యుత్, ఇన్‌కమ్ టాక్స్, ఫోర్ వీలర్, ఇళ్లు, పొలం తదితరాల పేరుతో వేలాదిమందిని పెన్షన్ పథకానికి అనర్హులను చేసి జగన్ ప్రభుత్వం తొలగించింది. అయితే, ఇలాంటి వారంతా కూటమి ప్రభుత్వంలో ఉపశమనం పొందుతున్నారు.

## ముగిసిన అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ భారత్ పర్యటన

**న్యూ దిల్లీ :** అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ భారత్ పర్యటన ముగిసింది. జె.డి. వాన్స్ తన భార్య, ముగ్గురు పిల్లలు గురువారం జైపూర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో వాషింగ్టన్‌కు బయలుదేరినట్లు అధికారులు గురువారం తెలిపారు. సోమవారం రాత్రి వాన్స్ కుటుంబం దిల్లీ నుండి జైపూర్ చేరుకుంది. మంగళవారం రాజస్థాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో దౌత్యవేత్తలు, మేధావులను ఉద్దేశించి అమెరికా, భారత్ సంబంధాల పై ప్రసంగించారు. అంతకు ముందు ఆయన కుటుంబ సమేతంతగా అంబర్ కోటను సందర్శించారు. జైపూర్ చేరుకోవడానికి ముందు బుధవారం ఆగ్రా లోని తాజ్‌మహల్‌ను సందర్శించారు. వాన్స్ సోమవారం దిల్లీ లోని అక్షర్‌ధామ్ ఆలయ సందర్శనతో తన భారత పర్యటనను ప్రారంభించిన సంగతి తెలిసిందే. అనంతరం ప్రధాని మోదీ తో సమావేశమయ్యారు.



## సంపాద కీయం

# పొత్తుతో చిత్తయ్యేదెవరు?

గత లోక్‌సభ ఎన్నికలకు ముందు విడిపోయిన ఎఐఎడిఎంకె, బిజెపి పొత్తు ఒకటిన్నర సంవత్సరాల తర్వాత, 2026 ప్రారంభంలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు తిరిగి ఏర్పర్చుకొనేందుకు రెండు పార్టీలు ముందడుగు వేస్తున్నాయి. 2021లో అధికారాన్ని కోల్పోయినప్పటి నుండి తన ప్రాబల్యాన్ని కోల్పోతూ వస్తున్న ఎఐఎడిఎంకె డిఎంకె నేతృత్వంలోని కూటమిని అధికారం నుండి తొలగించే ప్రయత్నాలలో బిజెపితో చేతులు కలిపేందుకు సిద్ధమవుతున్నది. మరోవంక, దక్షిణాదిన వ్యాప్తి చెందేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించక పోవడంతో తమిళనాడులో బలం పెంచుకునేందుకు బిజెపి సైతం ఆత్రుతతో వ్యవహరిస్తున్నది. అయితే ఆ రెండు పార్టీలు తప్పనిసరి పరిస్థితులలో చేతులు కలుపుతున్నా ఆచరణలో పరస్పరం అవిశ్వాసంతో వ్యవహరిస్తున్నాయి. ఆయా పార్టీలలో సైతం పొత్తుకు సానుకూలమైన సంకేతాలు కనిపించడం లేదు. ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా విధానం వంటి అంశాలను దూకుడుగా లేవనెత్తడంతో పాటు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో సంఘర్షణకు దిగడం ద్వారా 'తమిళ్ ప్రైడ్' ఆయుధంగా ప్రజల సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారు. ఓ విధంగా రాష్ట్రరాజకీయాలపై ఆధిపత్యంతో వ్యవహరిస్తున్న డిఎంకెను ఎదుర్కొనేందుకు అవసరమైన సైద్ధాంతిక, రాజకీయ పటుత్వం ఎఐఎడిఎంకె–బిజెపి కూటమిలో కనిపించడం లేదు. బిజెపితో తిరిగి పొత్తు పెట్టుకోవడంపై ఎఐఎడిఎంకెలో అసంతృప్తి గుసగుసలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. చివరకు ఈ పొత్తులో కీలకంగా కనిపించిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా సైతం ఒత్తిడులు ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తున్నది. ఆయన మద్దతుతోనే బిజెపి మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఏకపక్షంగా వ్యవహరిస్తూ, అన్నాడిఎంకెను మాత్రమే కాకుండా పార్టీలో కీలక నేతలను సైతం దూరం చేసుకున్నారని తెలుస్తోంది. పొత్తు ప్రకటన కోసం చెన్నైకి రావడానికి రెండు రోజుల ముందు కొంతమంది బిజెపి కార్యకర్తలు ఢిల్లీ వెళ్లి ఆయనను కలిసి అన్నామలైను అధ్యక్ష పదవి నుండి తొలగించాలని కోరితే ఆయన తీవ్రమైన ఆగ్రవేశాలు వ్యక్తం చేశారు. నాయకత్వం విషయం తమకు వదిలివేసి బూత్ స్థాయిలో పార్టీ పని చూసుకోండి అంటూ మందలించి పంపించారు. నాయకులపై ఫిర్యాదు చేయడానికి ఢిల్లీకి రావద్దని హెచ్చరించారు. అయితే, ఎఐఎడిఎంకెతో పొత్తు కోసం ఏప్రిల్ 10న అమిత్ షా చెన్నైకి వచ్చినప్పుడు, దాని నాయకుడు ఇ కె పళనిస్వామి విమానాశ్రయంలో తనకు స్వాగతం చెప్పేందుకు రాకపోవడంతో ఖంగుతిన్నారు. ఆ రోజు సాయంత్రం అనుకున్న ఎన్‌డిఎ మీడియా సమావేశం బిజెపి సమావేశంగా మారింది. దానితో వెంటనే ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త గురుమూర్తి వద్దకు వెళ్లి సమాలోచనలు జరిపారు. ఆ వెంటనే అన్నామలై సైతం వెళ్లి ఆయనను కలిశారు. అన్నాడిఎంకె–బిజెపి పొత్తులో మొదటి నుండి గురుమూర్తి కీలక భూమిక నిర్వహిస్తున్నారు. ఆ తర్వాతనే రాష్ట్ర అధ్యక్షుడిని మార్చడం, మరుసటి రోజు మాజీ అన్నాడిఎంకె నేత నైనార్ నాగేంద్రన్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించిన తర్వాతనే పొత్తు ఖరారు చేస్తూ అమిత్ షా ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి పళనిస్వామి రావడం జరిగింది. అయితే ఆ తర్వాత తమ పొత్తు సీట్ల సర్దుబాటు వరకే అని, ఎన్నికల అనంతరం తాము ఏర్పాటు చేయబోయే మంత్రివర్గంలో బిజెపి ఉండబోదని పళనిస్వామి ప్రకటించడం గమనార్హం. అన్నాడిఎంకెతో పొత్తు ప్రకటించిన తర్వాత ఇటీవలి సంవత్సరాలలో బిజెపి వైపు ఉన్న మాజీ ఎఐఎడిఎంకె నాయకులు, మాజీ సిఎం ఓ పన్నీర్ సెల్వం, తన సొంత పార్టీ ఎఎంఎంకెకు నాయకత్వం వహిస్తున్న టిటివి దినకరన్ వంటి వారు ఈ కూటమికి దూరంగానే కనిపిస్తున్నారు. బిజెపి–ఎఐఎడిఎంకె కూటమి అటువంటి పార్టీలను ఎన్‌డిఎ కూటమిలో ఎలా తీసుకురాగలదో చూడాలి. చెన్నైలో తమ కూటమిని ప్రకటిస్తూ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా బిజెపి ఎఐఎడిఎంకె అంతర్గత విషయాలలో జోక్యం చేసుకోదు లేదా తొలగించిన నాయకులను తిరిగి చేర్చుకోవాలని వారిని అడగదు. ఎటువంటి జోక్యం ఉండదు అని స్పష్టమైన హామీ ఇవ్వాల్సి రావడం గమనార్హం. 2016 ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేసిన బిజెపి ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. దాని 188 మంది అభ్యర్థులలో ఎనిమిది మంది తప్ప మిగిలిన వారందరూ డిపాజిట్లు కోల్పోయారు. 2.8% వద్ద, బిజెపి ఓట్ల వాటా 2011 ఎన్నికలలో పొందిన 2.2% నుండి స్వల్పంగా మాత్రమే పెరిగింది. అంతకు ముందు లోక్ సభ ఎన్నికలకు మాత్రమే పరిమితమైన ఎఐఎడిఎంకె– బిజెపి పొత్తు మొదటిసారిగా 2021లో అసెంబ్లీ ఎన్నికలకు విస్తరించింది. దానితో మొదటిసారిగా బిజెపి నాలుగు సీట్లు గెల్చుకోగలిగింది. ఆ పార్టీ రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లను గెలుచుకోవడం ఇది మూడోసారి మాత్రమే. ఎఐఎడిఎంకె సీట్ల సంఖ్య 66కు పడిపోయింది. చాలా సీట్లలో పోటీ చేసిన ఎఐఎడిఎంకె తన ఓట్ల వాటాను 33.3%కి తగ్గించుకుంది. అయితే, కేవలం 20 సీట్లలో పోటీ చేసినప్పటికీ బిజెపి ఓట్ల వాటా స్వల్పంగా 2.6%కి పడిపోయింది. సెప్టెంబర్ 2023 లో, ఎఐఎడిఎంకె నాయకత్వంపై అన్నామలై చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య సంబంధాలను తెంచుకొనే వరకు వెళ్లడంతో 2024 లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేశాయి. డిఎంకె నేతృత్వంలోని ఇండియా బ్లాక్ రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడం ద్వారా తన ఆధిపత్యాన్ని కొనసాగించడంతో వారిద్దరూ ప్రభావం చూపలేకపోయారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలను అసెంబ్లీ స్థాయిలో పరిశీలిస్తే, ఒక్క సీటు కూడా గెలవలేకపోయినప్పటికీ, బిజెపి 59 సెగ్మెంట్లలో రెండవ స్థానంలో, 64 సెగ్మెంట్లలో మూడవ స్థానంలో నిలిచింది. వీటిలో, బిజెపి 56 అసెంబ్లీ సెగ్మెంట్లలో 20 శాతం కంటే ఎక్కువ ఓట్లను, 20 సెగ్మెంట్లలో 30 శాతం కంటే ఎక్కువ ఓట్లను సాధించింది. ఆ బలంతోనే వచ్చే ఎన్నికలలో తన ఉనికిని మరింతగా పెంచుకునేందుకు బిజెపి ఉత్సాహ పడుతున్నది. తమిళ పార్టీలు తమ సైద్ధాంతిక పటుత్వం కోల్పోయాయని, దానితో ఇప్పుడు జాతీయ రాజకీయ పార్టీలకు తమిళనాడులో అనువైన వాతావరణం ఏర్పడుతున్నదని తుగ్లక్ సంపాదకుడు ఎస్ గురుమూర్తి భావిస్తున్నారు. అందుకనే అన్నాడిఎంకె– బిజెపి కూటమిని తమిళ ప్రజలు ఆదరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

అయితే, జయలలిత మరణం తర్వాత అన్నాడిఎంకె శ్రేణులు అందరినీ ఉమ్మడిగా తీసుకెళ్లగల నాయకత్వం ఆ పార్టీలో కనిపించడం లేదు. మరోవంక బిజెపిని 'తమిళ్ వ్యతిరేక' పార్టీగా ప్రజలు చుస్తున్నారని, అందుకనే ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని దెబ్బ తిన్నామని గతంలో ఆ పార్టీ నాయకులు బహిరంగంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవి వ్యవహారం సైతం బిజెపిని 'తమిళ వ్యతిరేక' పార్టీగా చూపే ప్రయత్నాలకు ఊతం కలిగిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులే ఆందోళన చెందుతున్నారు. అసెంబ్లీ రెండు సార్లు ఆమోదించిన బిల్లులను ఆమోదించకుండా పక్కన పడవేయడం ద్వారా సుప్రీం కోర్టు ద్వారా చివాట్లు తిన్న తర్వాత కూడా ఆయన వైఖరిలో మార్పు కనిపించడం లేదు. ఆ బిల్లుల్లో ఒక బిల్లు విశ్వవిద్యాలయాల వ్యవహారాలలో గవర్నర్ పాత్ర నామమాత్రమే అని స్పష్టం చేస్తుంది. ఏప్రిల్ 16న అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, రిజిస్ట్రార్లతో ముఖ్యమంత్రి స్టాలిన్ సమావేశం నిర్వహించారు. అయితే విశ్వవిద్యాలయాలపై ముఖ్యమంత్రి కన్నా తానే అధికుడని సంకేతం ఇచ్చేందుకు ఏప్రిల్ 25 నుండి మూడు రోజుల పాటు ఊటీలో అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల సమావేశం ఏర్పాటుచేసి, దానికి స్వయంగా ఉపరాష్ట్రపతి జగదేవ్ ధంకర్‌ను ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా ఈ విధంగా సమావేశం ఏర్పాటు చేయడం సుప్రీంకోర్టు తీర్పు ధిక్కారమే అంటూ కేవలం డిఎంకే కూటమిలోని పక్షాలే కాకుండా అన్నాడిఎంకె,– బిజెపి కూటమిలోని పక్షాలు సైతం ఆగ్రవేశాలు వ్యక్తం చేస్తున్నాయి. చివరకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు సైతం గవర్నర్ చర్యను సమర్థింపలేకపోతున్నారు. గవర్నర్ చర్యలు రాజకీయంగా డిఎంకె కూటమికి బలం చేకూరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకనే తక్షణమే గవర్నర్‌ను మార్చాలని చూస్తున్నట్లు తెలుస్తున్నది. మరోవంక, అన్నామలైని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకురావడం ద్వారా తమిళ రాజకీయాల్లో కీలక వ్యక్తిగా కొనసాగించాలంటూ అమిత్ షా చేస్తున్న ప్రయత్నాలు సైతం ఈ కూటమి సయోధ్యకు ప్రశ్నార్థకం చేస్తున్నాయి. పరస్పర వైరుధ్యాల మధ్య ఈ కూటమి వచ్చే ఏడాది ఎటువంటి ఫలితాలు సాధించగలదో చూడాల్సి ఉంది.

# సస్పెన్షన్ పై దువ్వాడ ఎమోషనల్

టెక్కలి పెన్ సత్తా : ఏపీలో ఉత్తరాంధ్ర వైసీపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన దువ్వాడ శ్రీనివాస్ ను తాజాగా ఆ పార్టీ సస్పెండ్ చేసింది. వ్యక్తిగత కారణాలతో ఆయన్ను సస్పెండ్ చేశారు. దీని పై ఇవాళ దువ్వాడ శ్రీనివాస్ స్పందిస్తూ ఓ వీడియో రిలీజ్ చేశారు. ఇందులో వైసీపీ నిర్ణయం పై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 22 న వైసీపీ తనను సస్పెండ్ చేసినట్లు చేసిన ప్రకటన పై ఆ పార్టీ ఉత్తరాంధ్ర నేత దువ్వాడ శ్రీనివాస్ స్పందించారు. వైసీపీ ప్రకటన పై తాను స్పందించాల్సిన అవసరం ఉందని భావిస్తూ వీడియో విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా వైసీపీలో ఈ హెూదా తనకు ఇచ్చిన జగన్ కు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ కోసం తాను చాలా కష్టపడ్డానని, పార్టీ గొంతై మాట్లానని, పార్టీలో ఉంటూ ప్రత్యర్థుల పై విమర్శలు చేశానన్నారు. కానీ ఇప్పుడు వ్యక్తిగత కారణాలు చూపుతూ సస్పెండ్ చేశారని తెలిసిందన్నారు. ఇందుకు పార్టీ తనకు అందించిన సహకారం, రాజశేఖర్ రెడ్డి తో అడుగు వేసిన తాను, జగన్ తో నడుస్తున్న తాను, తన హృదయంలో జగన్ స్థానం సుస్థిరం అన్నారు. రాజకీయ క్రీనీడలో తాను బలైనట్లు భావిస్తున్నట్లు తెలిపారు. పాతికేళ్లుగా ప్రజా జీవితంలో ఉన్న తాను, ప్రజాసేవనే పరమావధిగా భావించిన తాను ఏరోజూ పార్టీకి ద్రోహం చేయలేదని, లంచాలు తీసుకోలేదని, అవినీతి చేయలేదని, భూకబ్జాలు చేయలేదన్నారు. జరిగిన పరిణామాన్ని తాను స్వీకరిస్తున్నట్లు దువ్వాడ తెలిపారు. సస్పెన్షన్ అనేది తాత్కాలిక విరామమే అన్నారు. విరామం ఎరుగక పనిచేయాలన్న గురజాడ అప్పారావు చెప్పిన ఓ మాటను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. తాను అలాగే విరామం లేకుండా తనను నమ్ముకున్న ప్రజలు, గ్రామాల కోసం రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తానన్నారు. తన అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తన అభిమానులంతా ధైర్యంగా ఉండాలని కోరారు. గ్రామ గ్రామాన మళ్లీ తిరుగుతానని, ప్రతీ ఇంటికి తాను వస్తానని దువ్వాడ తెలిపారు. ప్రజలతో నేరుగా సంబంధాలు ఉన్న తాను ఎవరినీ వదిలిపెట్టే పరిస్థితి లేదన్నారు. కష్టపడి పనిచేస్తానని, అన్నింటికీ కాలమే తీర్పు చెప్తుందని తాను నమ్ముతానన్నారు. ఇంతవరకూ ఈ గౌరవం ఇచ్చిన ప్రజలందరికీ, ముఖ్యంగా టెక్కలి ప్రజలకు సాష్టాంగ ప్రణామాలు చేస్తానన్నారు. ఊపిరి ఉన్నంతవరకూ మీ సేవలో నిమగ్నం అయి ఉంటానని, తన అవసరం ఎక్కడ ఉంటే అక్కడ ప్రత్యక్షమైన ప్రతీ ఒక్కరికీ ఉపయోగపడేందుకు కృషి చేస్తానన్నారు. వైసీపీలో పనిచేసే అవకాశం ఇచ్చిన జగన్ కు మరోసారి ధన్యవాదాలు తెలిపారు.



# రాష్టానికి మార్గదర్శకుడు చంద్రబాబు చిరంజీవి వ్యాఖ్య

విజయవాడ పెన్ సత్తా : విజయవాడలో నిర్వహించిన మైండ్ సెట్ షిఫ్ట్ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ పుస్తకాన్ని ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోడలు శరణి రచించారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు, తొలి ప్రతిని చిరంజీవికి అందించారు. ఈ సందర్భంగా చిరు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఒకే వేదిక పై మెగాస్టార్ చిరంజీవి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన చిరంజీవి చంద్రబాబు పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమంలో భాగంగా చిరంజీవి మాట్లాడుతూ (పుస్తకానికి తగట్టు) కాలేజీ రోజుల నుంచే చంద్రబాబు నాయకత్వ లక్షణాలు ప్రదర్శించారని అన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసంమే చంద్రబాబు మైయిన్డ్ సెట్ లో చాలా కష్టపడుతున్నారు అని కొనియాడారు. ప్రధానంగా తనకు సినిమా అంటే ఎంత మక్కువ ఉందో, చంద్రబాబుకు కూడా రాజకీయాల పట్ల అదే మక్కువ ఉందని, అది చూపించే ఆయన ఈ రంగాన్ని ఎంచుకున్నారని అన్నారు. వచ్చిన ప్రతీ అవకాశాన్ని ఎదగడానికి ఆయన ఉపయోగించుకున్నారని చిరు తెలిపారు. ఆయన నాయకత్వంలో హైదరాబాద్ ను ఐటీ నగరంగా తీర్చిదిద్దారని చెప్పిన చిరంజీవి, దూరదృష్టి గల నాయకుడైన చంద్రబాబు ఐటీ, డిజిటల్ రంగాల్లో ఎన్నో పురోగతులను తీసుకొచ్చారని, ఆయన రాజకీయాల్లో మార్గదర్శకుడని ఏపీ ముఖ్యమంత్రిని చిరంజీవి కొనియాడారు. ఇదే సమయంలో చిరంజీవినీ చంద్రబాబు కొనియాడారు. ఇందులో భాగంగా సినీనటులు సామాజిక సేవ గురించి ఆలోచించడం అరుదని, అలా చేసిన తొలి వ్యక్తి చిరంజీవి అని చంద్రబాబు అన్నారు. తాను ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తాము అప్పుడప్పుడూ కలుసుకునే వాళ్లమని, బ్లడ్ బ్యాంక్ పెట్టాలను కుంటున్నానని, స్థలం కావాలని అడిగేవారని తెలిపారు.




# సంపద తక్కువ, అప్పులు ఎక్కువ బుగ్గన ఫైర్

తాడేపల్లి పెన్ సత్తా : రాష్టంలో సంపద సృష్టి తక్కువ, అప్పులు ఎక్కువ అంటూ కూటమి ప్రభుత్వం పై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సెటైర్లు వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అప్పుల మయం అని, మరి సంపద పరిస్థితి ఏంటి..? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మాకు కేంద్రంలో మద్దతు ఉంది అని కూటమి నాయకులూ చెప్పుకుంటున్నారు కానీ, ఇక్కడ ఎటువంటి మార్పు లేదు అని ఆయన దుయ్యబట్టారు. వైసిపి ప్రాభుత్వంలో అప్పు అంత ఉంది, ఇంత ఉందని ఎవరు నోటికి ఏదోస్తే అది చెప్తున్నారు మట్కా లెక్కల మాదిరి అని ఎద్దేవా చేసారు. చంద్రబాబు సంపదను సృష్టిస్తామని చెబుతుంటే అనుభవం గల నేతని ప్రజలు వారిని నమ్మారు అని ఆయన పేర్కొన్నారు. ఇక, వైసీపీ దిగిపోయే నాటికి 81,400 కోట్ల పన్ను ఆదాయం ఉంటే, మా కంటే తక్కువగా మీ ఆదాయం ఉంది అని బుగ్గన అన్నారు. మా కంటే 7.5 శాతం తక్కువగా కూటమి ప్రభుత్వం సంపద సృష్టి ఉంది, సంపద సృష్టి తక్కువ, అప్పులు ఎక్కువ చేసింది కూటమి ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు. సామాన్య మానవుడి కోసం మేం పరిపాలన చేశాం, కానీ మీరు వైసీపీ అప్పు చేసింది అంటారు. మా కంటే అప్పు ఎక్కువగా చేసి ఎవరికి పెడుతున్నారు.? అని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. జగనన్న ఉన్నపుడు ఉన్న పథకాలు రావడం లేదు అని ప్రజలు విమర్శిస్తున్నారు అన్నారు. మీరు అధికారంలో ఉన్నా పథకాలు రాలేదు కానీ, సంపద అంతా ఎక్కడికి పోతుంది అంటూ కూటమి ప్రభుత్వం పై ప్రశ్నల వర్షం కురిపించారు మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి.



# విడదల రజని మరిది గోపి అరెస్టు

**-అవినీతి ఆరోపణల పై ఎసిబి విచారణ**

**-స్టోన్ క్రషర్స్ నుంచి రూ.2.20 కోట్ల లంచం తీసుకున్నట్టు కేసు**

అమరావతి పెన్ సత్తా : మాజీ మంత్రి విడదల రజని మరిది విడదల గోపి ని ఎసిబి అధికారులు గురువారం హైదరాబాద్‌లో అరెస్టు చేసి, తాడేపల్లి ఎసిబి కార్యాలయానికి తరలించారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు పల్నాడు జిల్లా, యడ్లపాడు మండలం, విశ్వనాధుని కండ్రికలో లక్ష్మీ బాలజీ స్టోన్ క్రషర్ యజమాన్యం నుంచి రూ. 2.20 కోట్ల ముడుపులు తీసుకున్నారని వచ్చిన ఆరోపణల పై ఎసిబి అధికారులు కేసు నమోదు చేశారు. విడదల రజనితో పాటు గతంలో గుంటూరులో విజిలెన్సు జిల్లా అధికారిగా పనిచేసిన జాషువా, రజని మరిది గోపి, పిఎ డి.రామకృష్ణ తదితరుల పై స్టోన్ క్రషర్ యజమానుల ఫిర్యాదు చేయగా ఎసిబి అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తొలుత విజిలెన్సు అధికారులు దర్యాప్తు చేయగా తరువాత ఈ కేసులో అవినీతి జరిగిందని ప్రాథమిక నిర్ధారణ రావడంతో కేసును ఎసిబికి అప్పగించారు. టిడిపి కూటమి ప్రభుత్వం రాగానే స్టోన్ క్రషర్ యజమానులు చలపతి రావు, శ్రీనివాసరావుల ఫిర్యాదు మేరకు తొలుత విజిలెన్సు విచారణ జరిగింది. ఈ విచారణలో అవినీతి జరిగినట్టు ప్రాథమిక ఆధారాలు ఉండడంతో విజిలెన్సు అధికారుల నివేదిక మేరకు ఎసిబి విచారణకు ప్రభుత్వం గత మే 22 న ఆదేశించింది. ఈ కేసులో విడదల రజనితో పాటు ఐపిఎస్ అధికారి జాషువా, ఆమె మరిది గోపి, డి రామకృష్ణలను నిందితులుగా పేర్కొంటూ ఎసిబి ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించి విడదల గోపిని అరెస్టు



చేశారు. తొలుత అప్పటి మంత్రి పిఎగా ఉన్న డి.రామకృష్ణ, విజిలెన్సు ఎస్‌పి కలిసి స్టోన్ క్రషర్ యజమానులను బెదిరించినట్టు ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా స్టోన్ క్రషర్స్ నిర్వహణలో లోపాలు ఉన్నాయంటూ విజిలెన్సు జిల్లా అధికారి జాషువా వేటి తనిఖీకి వెళ్లారు. ఇందుకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోలేదని, తనిఖీ పూర్తయిన తరువాత ప్రభుత్వానికి నివేదిక ఇవ్వలేదని జాషువా పై కేసు నమోదైంది. రామకృష్ణ స్వయంగా బెదిరించారని ఆధారాలను దర్యాప్తులో సేకరించినట్లు అధికారులు చెప్తున్నారు. విడదల గోపి వచ్చి డబ్బులు తీసుకున్నారని ఫిర్యాదు దారులు తగిన ఆధారాలు చూపడంతో ఎసిబి కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం వీరంతా హైకోర్టును ఆశ్రయించినా ఇంకా బెయిల్ రాలేదు. గోపిని గురువారం అరెస్టు చేసి విజయవాడ ఎసిబి కోర్టులో హాజరు పరిచామని ఎసిబి అధికారులు తెలిపారు.

# ఉగ్రవాదులను కఠినంగా శిక్షిస్తాం ప్రధాని మోదీ

పాట్నా : జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రదాడికి పాల్పడిన వారిని, కుట్రదారులను వారి ఊహకు మించి శిక్షిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా బీహార్ లోని మధుబని జిల్లాలో ఝుంఝుపూర్‌లో జరిగిన బహిరంగ ర్యాలీలో మోదీ ప్రసంగించారు. భారతీయుల ఆత్మ పై జరిగిన ఉగ్రదాడికి బాధ్యులు శిక్షకు గురి కాకుండా తప్పించు కోజాలరని మోదీ పేర్కొన్నారు. దేశ ఐక్యతా స్ఫూర్తిని ఉగ్రవాదం ఎప్పటికీ విచ్ఛిన్నం చేయలేదని చెప్పారు. అలాగే అండగా నిలిచిన దేశాలకు మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. బీహార్‌కు రూ. 13,480 కోట్ల కు పైగా విలువైన అభివృద్ధి పనులను మోదీ ప్రారంభించారు. ఈ సభలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ కూడా ప్రసంగించారు.



# పదిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్





**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 24:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో రికార్డు స్థాయి ఫలితాలను సాధించిన అనకాపల్లి జిల్లాలో అత్యుత్తమ స్థాయిలో 590 కి పైగా మార్కులు సాధించిన జిల్లాలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన తొమ్మిది మంది విద్యార్థులను గురువారం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ప్రత్యేకంగా అభినందించి, మెమోంటోలను బహుకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 600 మార్కులకు గాను 590 పైగా మార్కులను ప్రభుత్వ పాఠశాలలో చదివిన తొమ్మిది మంది విద్యార్థులు సాధించడం హర్షించ దగ్గ విషయమన్నారు. జిల్లాలో 10 వ తరగతి పబ్లిక్ పరీక్షలను ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు, ఆరోపణలు లేకుండా విజయవంతంగా నిర్వహించడంతో పాటు రాష్ట్ర స్థాయిలో ఐదో స్థానం సాధించుటకు కృషి చేసిన జిల్లా విద్యా శాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడును, ప్రధాన ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు. పరవాడ మండలం పెద ముసిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆర్శి వెంకట జయ 595 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లాలోనే ప్రధమ స్థానంలో నిలిచారు. అచ్చుతాపురం ఏ పీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థిని కోసూరు మౌనిక 593 మార్కులు, పరవాడ మండలం పెదముసిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పల్లా అనుష్క 592 మార్కులు, పరవాడ మండలం తానాం ఎం జి పి ఏ పి బి సి రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థిని వాసిరెడ్డి వెంకటలక్ష్మి 592 మార్కులు సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండండి

**- చెరువులు, వాగులు, కాలువలు వంటి నీటివనరుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్త వహించండి**

**- పిల్లలకు వినోదభరితమైన విజ్ఞానం పెంపొందించడం పై దృష్టి పెట్టండి.**

**- తల్లిదండ్రులకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచనలు**

**ఏలూరు, పెన్ సత్తా, ఏప్రిల్ 24:** వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లల పట్ల తమ తల్లిదండ్రులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని అమ్మమ్మ, తాతయ్యల ఇళ్లకు పిల్లలను పంపించే ముందు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీ తెలిపారు. సహజంగానే పిల్లల్లో వాగులు, చెరువులు, కాలువలు వంటి నీటివనరుల్లో ఈత కొట్టాలనే కోరిక ఉంటుందని, నీటివనరులకు పిల్లలను దూరంగా ఉంచాలని, అవసరమైతే భద్రత ఏర్పాట్లు కలిగిన స్విమ్మింగ్ పూల్ కి తీసుకువెళ్లి పిల్లలు కోరిక తీర్చాలని ఎంపీ సూచించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున సాధ్యమైనంత వరకు పగటిపూట పిల్లలను బయటకు పంపవద్దని, తప్పనిసరైతే వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీ పేర్కొన్నారు. వేసవి సెలవులు వృధా చేయకుండా సద్వినియోగం చేసుకునే దిశగా పిల్లలకు మార్గనిర్దేశం చేయాలని ఎంపీ తెలిపారు. వినోదంతో కూడిన విజ్ఞానం పెంపొందించడానికి పిల్లల అభీష్టం మేరకు స్పోర్ట్స్ అండ్ గేమ్స్, సంప్రదాయ నృత్యాలు, చదరంగం, స్విమ్మింగ్ వంటి వాటిలో శిక్షణ ఇప్పించాలని ఎంపీ సూచించారు. పిల్లల్లో దాగి వున్న వ్యక్తిగత నైపుణ్యాలను వెలికి తీసేందుకు కూడా వేసవి సెలవులు దోహదం చేస్తాయని, ఆ దిశగా తల్లిదండ్రులు దృష్టి సారించాలని ఎంపీ తెలిపారు. దీనికి భద్రత చర్యలు చేపట్టాలని కలెక్టర్ కు ఎంపీ లేఖ. వేసవి సెలవుల నేపథ్యంలో చెరువులు, వాగులు, కాలువల్లో ఈత కొట్టేందుకు పిల్లలు వెళ్లే అవకాశం ఉన్నందున నీటి వనరుల వద్ద భద్రత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ వెట్రిసెల్వికి ఎంపీ మహేష్ కుమార్ లేఖ రాశారు. నీటి వనరుల వద్ద సచివాలయ సిబ్బంది, గ్రామస్థాయిలో పనిచేసే ఉద్యోగులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని లేఖలో పేర్కొన్నారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల సేవలు వినియోగించుకోవాలని ఎంపీ సూచించారు.



# టెక్నాలజీని ప్రజల కోసం వినియోగించాలి

**- ఎఐ వర్క్ షాపులో సిఎం చంద్రబాబు నాయుడు**

**అమరావతి పెన్ సత్తా :** టెక్నాలజీని ప్రజల కోసం ఉపయోగ పెట్టాలని, దీనికోసం రాష్ట్రంలో భారీ డేటా లేక్‌ను ఏర్పాటు చేయడం పై దృష్టి పెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అంశం పై గురువారం సచివాలయంలో ఉన్నతాధికారులతో జరిగిన వర్క్ షాపును సిఎం ప్రారంభించారు. ఎఐ, ఎమర్జింగ్ టెక్నాలజీ అవసరం, పాలనలో వాటి వినియోగం పై సిఎం మాట్లాడారు. 2 ఎంబిపిఎస్ ఇంటర్నెట్ కోసం ఎదురు చూసిన రోజుల నుండి డేటా ఆధారిత పాలన దిశగా ఎపిని తీర్చిదిద్దిన తన ప్రయాణాన్ని సిఎం గుర్తు చేసుకున్నారు. 30 ఏళ్లనాటి ప్రయత్నంతో నేడు ఎఐ టెక్నాలజీలో ముందుందని పేర్కొన్నారు. మేథా సంపత్తి ఉన్నవారు కూడా ఇప్పటికీ పాత విధానాలను అనుసరిస్తున్నారని, పాలన తీరులో మార్పు రావాలని సిఎం తెలిపారు. అలాగే ప్రజల నుండి వచ్చే వినతుల్లో అత్యధిక భాగం భూ సంబంధితమైనవే ఉన్నాయని ఆ సమస్యల పరిష్కారానికి త్వరితగతిన భూ రికార్డుల డిజిటలైజేషన్ చేయాలని సిఎం చెప్పారు. ఒకప్పుడు ఇస్రో ఉపగ్రహాలను ఆశ్చర్యంగా చూశామని, ఇప్పుడు స్టార్టప్‌లు రూ.30 కోట్లతో ఉపగ్రహాలు చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ అన్ని విభాగాల్లోనూ కృత్రిమ మేధ, సాంకేతిక వినియోగం ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించేదిశగా వర్క్ షాపు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ అంశం పై ఇప్పటికే 200 కుపైగా కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి 9,000 మందికి పైగా అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎపి తొలి ఐటి కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 1996 లో ఐటి గురించి మాట్లాడిన తొలి సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గుడ్ గవర్నెన్స్‌లో ఐటి పాత్ర అత్యంత కీలకమైందని తెలిపారు. ప్రభుత్వ ఐటి సెక్రటరీ కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వర్క్ షాపు ఉపయోగ పడుతుందని తెలిపారు. వాద్వాని సెంటర్ సిఇఓ ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం తమ సంస్థను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులను ఎఐ ఛాంపియన్లుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి శిక్షణలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.



# నియోజకవర్గంలో ఎక్కడా కూడా నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడతాం





**ముదిగుబ్బ, పెన్ సత్తా, ఏప్రిల్ 24 :** ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బ మండలంలో ప్రజలు ఇటీవల నీటి ఎద్దడితో తీవ్రంగా బాధపడుతున్న విషయాన్ని పది రోజుల క్రితం ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి రావడంతో ఎన్డీఏ కార్యాలయ మంత్రి ఇన్చార్జ్ హరీష్ బాబుకు సమస్య పరిష్కారించ వలిసిందిగా మంత్రి ఆదేశాలు. మంత్రి ఆదేశాల మేరకు ముదిగుబ్బ మండలంలో వెళ్లి ముదిగుబ్బ పంప్ హౌస్ లో ఉన్న మోటర్లు చెడిపోయిన వాటిని పూర్తిగా మరమ్మతులు చేయించి నీటి కొరతను తీర్చడం జరిగింది. ఈ సందర్భంగా హరీష్ బాబు అక్కడి పనులను పరిశీలించి నీటి ఎద్దడిని నివారించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కేవలం ఐదు రోజుల వ్యవధి లోనే మోటార్లను మరమ్మత్తు చేసి మళ్లీ నీటీ సరఫరాను పునరుద్ధించడం పట్ల ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. తొలుత హరీష్ బాబు సంబంధిత అధికారులతో సమావేశమై సమస్యల పై వారు చర్చించడం జరిగింది. తదుపరి అధికారులు సమస్యలను వివరిస్తూ రెండు స్పేర్ మోటార్లు అవసరం ఉందని, అంతేకాకుండా 20 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం గల కొత్త సంపు నిర్మించాలన్న, లేదా ఐచికంగా సిపిడబ్ల్యూఎస్ పథకం కింద పది లక్షల లీటర్ల సామర్థ్యము గల సంపు అవసరముందని వారు వివరించారు. ఈ ప్రతిపాదనలు విన్న హరీష్ బాబు మంత్రి దృష్టికి తీసుకొని వెళ్లగా మండల గ్రాండ్ కింద చేపడతామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి కార్యాలయ సిబ్బంది, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, అధికారులు, ముదిగుబ్బ మండల అధ్యక్షులు అంజన్ రెడ్డి, గోసాల కృష్ణమూర్తి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్‌లో చిక్కుకున్న ఎస్పీ, కలెక్టర్

**భీమవరం పెన్ సత్తా :** భీమవరం పట్టణం లోని పీపీ రోడ్డులో గురువారం ఒక వస్త్ర దుకాణం ప్రారంభం సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. బుల్లి తెర యాంకర్ రాక, వస్త్ర దుకాణ ఒక్కరోజు ఆఫర్‌తో జనం భారీగా ఎగబడ్డారు. పీపీ రోడ్డు పై కొనుగోలుదారులు బారులు తీరడంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను మావుళ్లమ్మ గుడి రోడ్డు మీదుగా మళ్లించారు. దీనితో పట్టణంలో సుమారు ఐదు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవడం, ఎండ తీవ్రతతో వాహనదారులు అవస్థలు పడ్డారు. అదే సమయంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, కలెక్టర్ సి.నాగరాణి వాహనాలు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. పోలీసు బొమ్మ సెంటర్, మావుళ్లమ్మ గుడి రోడ్డు, తాలూకా ఆఫీస్ సెంటర్, ప్రకాశం చౌక్, అంబేద్కర్ సెంటర్, బాంబే స్వీట్ సెంటర్లలో అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో జిల్లా అధికారులకు సైతం తిప్పలు తప్పలేదు.




# ఉగ్రదాడి నేపథ్యంలో మంత్రి చొరవతో ప్రత్యేక విమానాలు



**ఢిల్లీ:** జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక విమానాలు నడిపించాలని సంబంధింత అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు అధికారులు తనకు సమాచారం అందించాలని కేంద్రమంత్రి రామ్మోహన్ కీలక ఆదేశాలు జారీ చేశారు. తెలుగు ప్రజలను సురక్షితంగా ఏపీకి చేర్చడానికి ప్రత్యేక చొరవ తీసుకున్నామని కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీనగర్ నుంచి దిల్లీ, ముంబైకి నాలుగు ప్రత్యేక విమానాల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. మరిన్ని విమానాలు సిద్ధంగా ఉంచేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సర్జ్ ప్రైసింగ్‌కి బ్రేక్ %-% టికెట్ల ధరలు పెంచవద్దని విమాన సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయం పై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుతో చర్చించారు. ఆంధ్రభవన్‌లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని అన్నారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో త్వరితగతిన చర్యలు చేపట్టి, బాధిత పర్యాటకులు, మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని కేంద్రమంత్రి రామ్మోహన్ తెలిపారు. అక్కడి పరిస్థితి తెలిసిన వెంటనే కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడి, శ్రీనగర్ నుంచి దిల్లీకి రెండు, ముంబైకి మరో రెండు ప్రత్యేక విమానాలు అందుబాటు లోకి తీసుకువచ్చామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. అవసరమైతే మరిన్ని విమానాలను సిద్ధంగా ఉంచేలా కూడా చర్యలు చేపడతామని తెలిపారు. ఇలాంటి విపత్కర సమయంలో ప్రయాణికుల పై భారం ఉండకూడదనే ఉద్దేశంతో ఏకకాలంలో టికెట్ల ధరలు పెంచకూడదని అన్ని ఎయిర్ లైన్స్‌ను ఆదేశించామని అన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడానని తెలిపారు. ఆంధ్రభవన్‌లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, కశ్మీర్‌లో ఉన్న తెలుగు పర్యాటకుల రాకపోకలు సమన్వయం చేసేలా చర్యలు చేపట్టామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. అలాగే, పహల్గామ్ వద్ద ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన విశాఖపట్నం వాసి చంద్రమౌలి కుటుంబానికి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే విశాఖ కలెక్టర్‌తో మాట్లాడి, మృతదేహాన్ని గౌరవంగా విమానమార్గంలో తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టామని అన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన మృతుల మృతదేహాలను తరలించడానికి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేస్తున్నామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో కేంద్ర ప్రభుత్వం బాధితులకు అండగా నిలవడం, ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించడం మానవతా ధోరణితో పని చేయడం ద్వారా రామ్మోహన్ నాయుడు ఒక బాధ్యతాయుతమైన నాయకుడిగా కీలకంగా వ్యవహరిస్తున్నారు.

# ఇవీఎం గోదామును తనిఖీ చేసిన డి.ఆర్.ఓ. వై. సత్యన్నారాయణ రావు

**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 24:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎమ్) గోదామును జిల్లా రెవెన్యూ అధికారివై సత్యన్నారాయణ రావు తనిఖీ చేశారు. మాసంతపు తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్.పి. కార్యాలయం ఆవరణలో గల ఈవీఎం గోదామును గురువారం ఉదయం జిల్లా రెవిన్యూ అధికారి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేసి అక్కడ భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి షేక్ అయిషా, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంటు వాసు నాయుడు, అనకాపల్లి స్టేషన్ ఫైర్ ఆఫీసర్, పి నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బి.తాతయ్య బాబు, బిజెపి ప్రతినిధి పి.నాగేశ్వరరావు, వైసీపీ ప్రతినిధి టి.షణ్ముఖ, ఆప్ పార్టీ ప్రతినిధి కె.హరినాధబాబు,సిపిఎం పార్టీ ప్రతినిధి జి శ్రీ రామ్, తదితరులు పాల్గొన్నారు.





# ఉగ్రవాద దాడిలో మృతులకు జనసేన మౌన దీక్షతో నివాళి

**- జనసేన పార్టీ అనకాపల్లి కార్యాలయం లో నిరసన**

**అనకాపల్లి పెన్ సత్తా ఏప్రిల్ 24:** జమ్ము కాశ్మీర్ లోని బైసరన్ ప్రాంతం లోని పహల్గాంలో పర్యాటకుల పై ఉగ్రవాదులు డాడీ చేసి 28 మందిని హతమార్చాడాన్ని తీవ్రంగా ఖండిస్తూదమృతులకు సంతాపం తెలియచేస్తూ అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయం లో మౌన దీక్ష చేపట్టడం జరిగింది. పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మూడు రోజుల సంతాపాలు నిర్వహించాలి అనే ఆదేశాను సారం స్థానిక శాసనసభ్యులు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పిలుపు మేరకు ఈ దుశ్చర్యను ఖండించి, మృతులకు సంతాపం తెలియచేస్తూ జనసేన పార్టీ కార్యాలయం లో మౌన దీక్ష చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాకిస్తాన్ భారతదేశం పై తన అక్కసుని మరొక్కసారి చూపించింది అని, ధైర్యంగా ఎదుర్కొలేక దొంగ దారిన సైనిక దుస్తుల్లో అమాయకమైన పర్యాటకులను పొట్టన పెట్టుకోవడం దుర్మార్గపు చర్య అన్నారు. పాకిస్తాన్ తో దౌత్య సంబంధాలు తెంచుకోవాలి అనే భారత ప్రభుత్వం నిర్ణయం సమర్ధించదగినది అన్నారు. ఉగ్రవాదులను, వారికి సహకరిస్తున్న వారిని సైతం ఏరి పారెయాల్సిన అవసరం ఉంది అని, ఇప్పటికి ఐనా కాశ్మీర్ పాకిస్తాన్ భూ భాగం అనే పాకిస్తాన్ వాదనను సమర్థిస్తూ కొద్ది మంది మన దేశంలో ఉండి మాట్లాడుతున్న వారు బుద్ది తెచ్చుకోవాలి అని, లేదా దేశం విడిచి వెళ్ళిపోవాలి అని అన్నారు. దేశ సమగ్రతకు, శాంతికి భంగం కల్గించే వారికీ సరైన గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ సందర్భంగా నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేసారు.



# 10 వ తరగతి పరీక్షల్లో 100 శాతం ఫస్ట్ క్లాస్ సాధించిన పోలీసు స్కూలు ఎస్పీ

**విజయనగరం పెన్ సత్తా ఏప్రిల్ 24:** జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విజయనగరం పట్టణం పోలీసు లైన్స్ లో నడపబడుతున్న పోలీసు సంక్షేమ ఆంగ్ల పాఠశాల విద్యార్థులు 10 వ తరగతి ఫైనల్ పరీక్షల్లో 100 శాతం ఉత్తమ ఫలితాలు సాధించినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించినందుకు వేడుకగా జిల్లా ఎస్పీ పోలీసు కార్యాలయంలో విద్యార్థులతో కేక్ కట్ చేయించి, విద్యార్ధులకు తినిపించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ నామ మాత్రపు ఫీజులతో పోలీసు సంక్షేమ ఆంగ్ల పాఠశాలలో ఇతర కార్పొరేట్ స్కూల్స్ కు ధీటుగా క్రమ శిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం పోలీసు స్కూలు నుండి ప్రప్రధమంగా 13 మంది విద్యార్థులు 10 వ తరగతి తుది పరీక్షలకు హాజరుకాగా, 100 శాతం ఉత్తమ ఫలితాలతో 13 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్ లో ఉత్తీర్ణులయ్యారన్నారు. ఇదే రకమైన ఫలితాలను పోలీసు స్కూలు విద్యార్థులు భవిష్యత్తులో కూడా సాధించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించుటలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల పట్ల మంచి శ్రద్ధ కనబర్చారని, విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా స్టడీ అవర్స్ నిర్వహించా రన్నారు. విద్యార్థుల విజయం ఇక్కడితో ఆగిపోకూడదని, విజయ పరంపర ఇక్కడ నుండే ప్రారంభం కావాలన్నారు. పోలీసు వెల్ఫేర్ స్కూలును ఇంకా అభివృద్ధి చేసేందుకు అవసరమైన బిల్డింగ్సు, టీచింగు, మెథడాలజీ, మెటిలియల్ వంటి ప్రణాళికలు, ప్రతిపాదనలను తీసుకొని వస్తే, వాటిని పాఠశాలలో అందుబాటు లోకి తీసుకొని వచ్చి, భవిష్యత్తులో జిల్లా లోనే క్రమశిక్షణ, ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న పాఠశాలగా తీర్చిదిద్దుతామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. పోలీసు వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య మాట్లాడుతూ తమ స్కూలు పిల్లలు డైమండ్స్‌గా మార్చడంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించారని, వారికి సబ్జెక్ట్స్ పరంగా ఎటువంటి సందేహాలు ఉన్నా, ఎప్పటికప్పుడు వాటిని నివృత్తి చేసామన్నారు. గత కొన్ని మాసాలుగా ఉపాధ్యాయులు పడిన శ్రమ మంచి ఫలితాలు ఇచ్చిందని, తమను ఎంతగానో ప్రోత్సహిస్తున్న జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ఇన్చార్జ్ ఆర్ఎస్ఐ ఎన్.గోపాల నాయుడు మాట్లాడుతూ - 10 వ తరగతి ఫైనల్ పరీక్షలకు హాజరైన తొలి ప్రయత్నం లోనే 100 శాతం ఉత్తమ ఫలితాలు సాధించడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. 13 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 11 మంది 500 మార్కులు పైగా సాధించడం, మిగిలిన ఇద్దరూ 490 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. 581 మార్కులతో స్కూలు ఫస్ట్ గా నిలిచిన ఎస్. వైష్ణవి, 575 మార్కులతో స్కూలు సెకండ్ గా నిలిచిన సిహెచ్.హర్ష వర్ధన్, 562 మార్కులతో స్కూలు థర్డ్ నిలిచిన జి.లవీంద్రులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి, ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేసారు. స్కూలు ఉపాధ్యాయులు, హెచ్.ఎం.సంధ్య, ఇతర పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అభినందించి, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా పని చేసి, ఉత్తమ ఫలితాలు రాబట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, అదనపు ఎస్పీ (ఎఆర్) జి.నాగేశ్వరరావు, ఆర్ ఐలు ఎన్.గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, టి.శ్రీనివాసరావు, హెచ్.ఎం.సంధ్య, స్కూలు ఇన్చార్జ్ ఆర్ఎస్ఐ వర ప్రసాద్, ఇతర పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపండి

**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 24:** ఓటరు జాబితాలో తయారీ ప్రక్రియలో సమస్యలు, పొరపాట్లు వంటి అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల నేతలు తమ దృష్టి కి తీసుకురావాలని జిల్లా రెవిన్యూ అధికారి వై సత్యన్నారాయణ రావు సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ వారు ఓటరు జాబితా గురించి ప్రతి నెల రాజకీయ పార్టీల నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చెయ్యాలని ఆదేశించిన సందర్భంగా గురువారం కలెక్టర్ కార్యాలయం తన ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో మాసంతపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా లోని సమస్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలనే లక్ష్యం తోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని డి.ఆర్.ఓ. తెలిపారు. ఓటరు జాబితాలకు సంబంధించిన అభ్యంతరాలు, సమస్యలు ఉంటే తమకు తెలిపాలన్నారు. ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేసేందుకు, పరస్పర అనుకూలమైన సలహాలు, సూచనలు అందించేందుకు రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని రాజకీయ పార్టీలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బూత్ స్థాయి అధికారుల నియామకం, ఓటరు జాబితాలను నాణ్యతగా తయారు చేసేందుకు, మెరుగు పరిచేందుకు మరింత మంది బూత్ స్థాయి అధికారులు, ఎలక్ట్రోరల్ అధికారుల నియామకానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని డి.ఆర్.ఓ. తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంటు, వాసు నాయుడు, ఉప తహసీల్దార్ రవి, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బి.తాతయ్య బాబు, బిజెపి ప్రతినిధి పి.నాగేశ్వరరావు, వైసీపీ ప్రతినిధి టి.షణ్ముఖ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి కె.హరినాధబాబు, సిపిఎం పార్టీ ప్రతినిధి జి శ్రీ రామ్, తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ కార్యక్రమం

**పరవాడ పెన్ సత్తా ఏప్రిల్ 24:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా కార్యాలయం సమావేశ మందిరంలో మహాత్మా గాంధీ, అంబెద్కర్ చిత్ర పటానికి ఎంపీపీ పయిల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు పుష్పాలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు గ్రామీణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం గ్రామ స్వరాజ్య సాధన కోసం అనేక చర్యలు తీసుకుంటోందని, నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకు విడుదల చేస్తోందని తెలిపారు. పంచాయతీల సిబ్బంది పాలకవర్గం ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం వంటి రంగాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను తెలియజేశారు. దేశం లోని అన్ని గ్రామ పంచాయతీలు మరింత స్వయం సమృద్ధి సాధించి, గ్రామీణ ప్రజల జీవితాల్లో గుణాత్మకమైన మార్పులు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎం.పి.డి.ఓ ధర్మారావు, కో ఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, ఎం.ఈ. ఓ దివాకర్, మాజీ ఆర్.ఈ. సి.ఎస్ చైర్మన్ చల్ల కనకరావు, వై.సి.పి నాయకులు బొద్దపు చిన్నారావు, పయిల రాధ కృష్ణ, వర్రీ హరి, మండల కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# చోడవరంలో నియోజకవర్గం లో మెగా జాబ్ మేళా

**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 24:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9-00 గంటలకు స్థానిక గవర్నమెంట్ హైస్కూల్, గాంధీ గ్రామం నందు దాదాపు 23 పైగా కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ మెగా జాబ్ మేళాలో బహుళ జాతీయ కంపెనీలు పాల్గొనుచున్నాయని, వాటి ద్వారా జిల్లా లోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఇంటర్వూలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తెలియజేశారు. ఈ మెగా జాబ్ మేళాకు హాజరు అయ్యే నిరుద్యోగ యువతీ, యువకులు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బి. ఫార్మసీ, ఎం. ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బి.టెక్, పి.జి, విద్యార్హతలు కలిగిన వారు 18 సంవత్సరాల నుంచి, 35 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరు అయ్యే అభ్యర్థులు ఖచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫోటోలతో హాజరుకావాలని, అర్హత కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు సూచించారు. మరిన్ని వివరాలకు,9494791935, 7981102224 ఫోన్ నంబర్స్ కు సంప్రదించాలని తెలియజేశారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరములను https://naipunyam.ap.gov.in/user-registration లో నమోదు చేసుకోగలరని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు తెలియజేశారు.

# ఉత్తమ సర్పంచ్ గా ఎం జగన్నాద పురం సర్పంచ్ కరెడ్ల బుల్లమ్మ ఎంపిక

**అచ్యుతాపురం పెన్ సత్తా ఏప్రిల్ 24:** జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ కార్యాలయంలో విశాఖ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రం లోని ప్రతి జిల్లా నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఉత్తమ సర్పంచ్ లను ఎంపిక చేశారు. అనకాపల్లి జిల్లా నుంచి కలెక్టర్ విజయ్ కృష్ణన్ దత్తత గ్రామం అయినటువంటి యలమంచిలి నియోజకవర్గం, అచ్యుతాపురం మండలం లోని ఎం జగన్నాధ పురం గ్రామాన్ని ఎంపిక చేసి సర్పంచ్ కరేడ్ల బుల్లెమ్మ కు విశాఖ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ఉత్తమ సర్పంచ్ పురస్కారాన్ని బహూకరించి, సాలువాతో సత్కరించారు. పురస్కారం అనంతరం సర్పంచ్ బుల్లమ్మ మాట్లాడుతూ ఈ అవార్డుకు ఎంపికైనందుకు ఎంతో ఆనందంగా ఉందని, ఈ ఉత్సాహంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి రాష్ట్ర ఉపముఖ్య మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ మంచి పేరు ప్రత్యేకతలు తీసుకువస్తానని అన్నారు.



# టీడీపీ గ్రామ బూత్ కమిటీలలో యువతకు, మహిళలకు ప్రాధాన్యత

**అనకాపల్లి పెన్ సత్తా ఏప్రిల్ 24:** మండలం లోని సిహెచ్.ఎన్ అగ్రహారం, రేబాక గ్రామాలు, కశింకోట మండలం చెరకాం, తీడ గ్రామాలలో టీడీపీ పార్టీ సంస్థాగత ఎన్నికలకు గ్రామం లోని టీడీపీ శ్రేణుల మధ్యే టీడీపీ గ్రామ బూత్ కమిటీ ఎన్నికల నిర్వహణ చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ & ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర ముఖ్య అతిదులుగా పాల్గొన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అనకాపల్లి మండలం సిహెచ్.ఎన్ అగ్రహారం, రేబాక గ్రామాలు, కశింకోట మండలం చెరకాం, తీడ గ్రామాలలో జరిగిన టీడీపీ పార్టీ సంస్థాగత ఎన్నికలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణుల మధ్యే టీడీపీ గ్రామ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైనా చెరకాం గ్రామ టీడీపీ ప్రెసిడెంట్ గా బండారు అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా చుక్క చిరంజీవి, తీడ గ్రామ టీడీపీ ప్రెసిడెంట్ గా మేడి శెట్టి సన్యాసి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా చిరికి సన్యాసి నాయుడు, సిహేచ్.ఎన్ అగ్రహారం గ్రామ టీడీపీ ప్రెసిడెంట్ గా శరగడం ఆదిబాబు, ప్రధాన కార్యదర్శి గంట్ల సూరిబాబు, రేబాక గ్రామ టీడీపీ ప్రెసిడెంట్ గా కోన నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కాపుశెట్టి అర్జున రావు లతో వారు ప్రమాణ స్వీకారం చేయించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా సిహేచ్.ఎన్ అగ్రహారం, రేబాక, చెరకాం గ్రామాలలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.



# 12 వ రోజు ఘనంగా శ్రీరామరక్ష రథయాత్ర

**రాంబిల్లి పెన్ సత్తా ఏప్రిల్ 24:** 12 వ రోజు శ్రీరామరక్ష రథయాత్ర కొత్తపట్నం, యాత కొత్తపట్నం, వాడ నరసాపురం, గోవింద పాలెం, కొత్తపేట, చిన్న కలవలపల్లి కుప్ప గొండపాలెం సాగింది. కోలాటాలు, తప్పిడి గుళ్ళు, సేవ గరిడీలు ప్రదర్శించి భక్తి శ్రద్ధలతో బాల రాముని దర్శించుకున్నారు. ముగింపులో హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్స్ పీలా రమాకుమారి, కలిదిండి శివాజీ బహదూర్, దాట్ల వర్మ, బోరవెల్లి ప్రమోద్ కుమార్, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, వర్మ రాజు, రఘు రాజు, పప్పల నూకన్న దొర, గంగాధర్, కొల్లి అప్పారావు, సోలార్ నూకరాజు, పూడి లక్ష్మి,పప్పు ఈశ్వరరావు, కొత్తపట్నం యాతకొత్తపట్నం,వాడ నరసాపురం, గోవిందపాలెం, కొత్తపేట,చినకలవలాపల్లి, కొప్పుగొండ పాలెం గ్రామాల సర్పంచులు, పాల సొసైటీ ప్రెసిడెంట్లు, పెద్దలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని రథయాత్ర కి ఘన స్వాగతం పలికారు.




# జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవంలో చైర్ పర్సన్ బోయ గిరిజ

**అనంతపురము పెన్ సత్తా ఏప్రిల్ 24:** జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవాన్ని పురష్కరించుకుని స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో డి.పి.ఆర్.సి సమావేశ మందిరం నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురము జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజ ల్గొన్నారు. కార్యక్రమంలో మెదటగా జిల్లా పరిషత్ కార్యాలయం లోని గాంధీ జీ విగ్రహానికి పూల మాలలతో నివాళులు అర్పించారు. అనంతరం డి.పి.ఆర్.సి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవ సభలో పాల్గొ ని మెదటగా కాశ్మీర్ ఉగ్రదాడిలో మరణించిన 28 మంది భారతీయులకు మౌనం పాటిస్తూ, నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ 73 వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయితీ రాజ్ వ్యవస్థకు రాజ్యంగ ప్రతిపత్తి కల్పించిన తర్వాత, ఏప్రిల్ 24 వ తేదీన అమలు లోనికి రావడం మొదలు నేటి దాకా గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామ పంచాయితీలే ప్రజాస్వామ్యానికి హృదయమని నమ్మి, మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్యం ఆలోచనలను మన ముందు ఉంచారన్నారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్య భారత దేశంలో గ్రామ స్వరాజ్య సాధన దిశగా, గ్రామాలలో ఏ ఒక్కరు పేదవారిగా మిగలకూడదని, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేసే ధృఢ సంకల్పంతో మన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఈ మూడంచెల పంచాయితీ రాజ్ వ్యవస్థలో కీలకమైన గ్రామ స్థాయి వ్యవస్థను బలపరిచే ఆలోచనతో గ్రామా సచివాలయాల వ్యవస్థను మొదలుపెట్టి, ప్రతి శాఖకు చెందిన అధికారులను ప్రజలకు అందుబాటులో ఉంచి ప్రజల వద్దకు పాలన అందిస్తూ నిజమైన గ్రామ స్వరాజ్య స్థాపన చేశారన్నారు. ఆ సచివాలయ వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సంక్షేమ దిశగా కొనసాగించాలని తెలియజేస్తూ, ఉమ్మడి జిల్లాల అధికారులకు, ప్రజలకు జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేసారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లాలలో పంచాయితీ రాజ్ వ్యవస్థలో భాగమై ఉత్తమ సేవలు అందించిన ముగ్గురు (ఆవులెన్న, వ్యాసాపురం, గన్నేవారిపల్లి పంచాయితీ) సర్పంచులకు, 29 మంది సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిగి జెడ్పిటిసి, జిల్లా ప్రజా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట సుబ్బయ్య, డి.పి.ఓ కార్యాలయ పరిపాలనాధికారి నాగరాజు, సర్పంచులు, పంచాయితీ రాజ్ అనుభంద శాఖల అధికారులు, యం.పి.డి.ఓ లు, జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.




# కాలువ కట్టారు... నీరు రోడ్డు మీదకే వదిలేసారు

**- చోడవరంలో చోద్యం**

**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 24:** లక్షల ఖర్చు పెట్టి కాలువలు కట్టారు...కానీ ఆ నీరు వెళ్లే మార్గం చూపించకపోవడంతో మురుగునీరు అంతా రోడ్డు మీద దర్శనమిస్తుంది. వాహన చోదకులకు ఇబ్బందిగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో చోడవరం ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారు. చోడవరంలోని లక్ష్మీపురం వెళ్లే రోడ్డులో కోణం గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న పాత చలపతి స్కూలు రోడ్డు పక్కన ఇటీవల లక్షలు ఖర్చుపెట్టి కాలువ కట్టారు. అయితే ఆ నీరు కోణం గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న తారురోడ్డు వరకు వచ్చి ఆగిపోతుంది. నీరు ఎక్కువై రోడ్డు మీదే దర్శనమిస్తుంది. కొందరు నాచుపెట్టిన రోడ్డుమీద పడిపోతున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు అటువైపు కాలువ ఉండడంతో గొట్టాం వేసి ఆ కాలువకు లింకు ఇస్తే నీరు సాఫీగా వెళ్ళిపోతుంది. రోడ్డుమీద నీరు ఉండడంతో ప్రమాదాలు జరగడమే కాకుండా రోడ్డు సైతం పాడవుతుంది. ఇప్పటికే చోడవరం ప్రాంతంలో రోడ్లు చాలా దారుణంగా ఉన్నాయి. ఇటువంటి చిన్న చిన్న పనులు కూడా చేయించకపోతే దారుణమైన రోడ్ల జాబితాలో లక్ష్మీపురం రోడ్డు కూడా కలిసిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. కాలువలు కట్టారని సంతోషం వ్యక్తం చేసి నీరు వెళ్లే మార్గం లేదని బాధపడుతున్నారు.





# వైభవంగా కాశీఅన్నపూర్ణ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 24:** బుచ్చియ్యపేట మండలంలోని విజయరామరాజుపేట గ్రామంలో ఉన్న శ్రీకాశీఅన్నపూర్ణ ఆలయంలో గురువారం ఘనంగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కుంచం నానిబాబు శర్మ స్వామిని అమ్మవారిని విశేషంగా అలంకరించి వైభవంగా కళ్యాణం జరిపారు. సుమారు 10 మంది దంపతులు శ్రీకాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ స్వామి ఆలయంలో కళ్యాణం జరిపించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదములు అందజేసి అన్నప్రసాదం (అన్న సమారాధన) ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా జడ్పీటీసీల ఫారం అధ్యక్షులు దొండా రాంబాబు, గ్రామ సర్పంచ్ యల్లపు విజయ్ కుమార్ పూర్ణా, మాజీ సర్పంచ్ దొడ్డి కిషోర్, చోడవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, శ్రీషిరిడి సాయిబాబా ఆలయ వ్యవస్థాపకులు దొడ్డి వెంకట ముత్యాలునాయుడు (డి.వి.ఎం నాయుడు), డాక్టర్ శరగడం మహాలక్ష్మి నాయుడు, యల్లపు నాయుడు, యల్లపు గోవింద, ఎమ్మెల్యే వెంకట్రావు, దొడ్డి కుమార్, పెంటకోట శ్రీను, పెంటకోట కృష్ణ, పెంటకోట తాతారావు, బీశెట్టి నాగేశ్వరరావు, బీశెట్టి వెంకట జగ్గారావు, పెంటకోట సూరయ్య, బీసెట్టి శ్రీను తదితరులు భారీగా భక్తులు పాల్గొన్నారు.

# చోడవరం అభివృద్ధికి సహకరించండి....

- మండల ఈవోపీఆర్డి మహేష్



**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 24:** నియోజకవర్గ కేంద్రం అయిన చోడవరం అభివృద్ధికి అందరూ సహకరించాలని మండల ఈవోపీఆర్డి వి.మహేష్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం ముందుగా మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలవేసి అందరూ నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రధాన సచివాలయంలో గ్రామ సర్పంచ్ బండి నూకాలమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల ఈవోపీఆర్బి మహేష్ మాట్లాడుతూ.... చోడవరం సుస్థిర అభివృద్ధికి అందరూ తగిన సూచనలు సలహాలు ఇచ్చి సహకరించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మేరకు లక్ష్యాలు చేదించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని, సమస్యలు ఏమున్నా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈవో కే.వీ.ఏ.ఎస్ నారాయణరావు మాట్లాడుతూ.... ప్రజా సమస్యలు పరిష్కరించడానికి తాము కృషి చేస్తున్నామని, తమకు సాధ్యం కానీ పనులు ఏమైనా ఉంటే ఉన్నతాధికారులు దృష్టి తీసుకువెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నాలు చేస్తామని పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో రోడ్లు కాలువలు నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నామని, అలాగే అన్ని ప్రాంతాలకు విద్యుత్తు లైటింగు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ చోడవరం మండల అధ్యక్షులు గూనూరు మూలునాయుడు, వార్డు మెంబర్లు టి.శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ లో ఈర్లె నవ్యశ్రీకి 597 మార్కులు



**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 24:** స్థానిక శ్రీ విజ్ఞాన్ జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ ఈర్లె గోవిందరావు పూర్ణ దంపతుల కుమార్తె నవ్యశ్రీ టెన్త్ లో తన ప్రతిభ కనబరిచి 600 లకు 597 మార్కులు సాధించింది. నారాయణ హైస్కూల్లో చదువుకుంటున్న నవ్యశ్రీ ఎక్కువ మార్కులు సాధించడంతో ఆమెను, ఆమె తల్లిదండ్రులకు పలువురు శు భాకాంక్షలు తెలిపి అభినందించారు. డాక్టర్ కావాలనే లక్ష్యంతో ఉన్నానని ఆ విద్యార్థిని నవ్యశ్రీ తెలిపింది. మరి ఆమెకు ఆల్ ది బెస్ట్ చెబుదాం.....

# స్తంభించిన కాశ్మీరం, 35ఏళ్ళలో తొలిసారి స్వచ్ఛందంగా

**శ్రీనగర్:** జమ్మూ కాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పహల్గాంలోని బైసరన్ ప్రాంతంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ ప్రజలు స్వచ్ఛందంగా బుధవారం బంద్ పాటించారు. దీంతో కాశ్మీర్ లోయలో జనజీవనం స్తంభించింది. దుకాణాలు, వ్యాపార సంస్థలు, పెట్రోల్ బంకులు, విద్యా సంస్థలు మూతపడ్డాయి. కాగా కాశ్మీర్ లోయలో ఉగ్రవాద దాడులకు వ్యతిరేకంగా ప్రజా జీవనం స్తంభించిపోవడం గత 35ఏళ్ళలో ఇదే మొదటిసారి. ఉగ్రవాదులు మంగళవారం జరిపిన దాడిలో 28 మంది ప్రాణాలు కోల్పోగా పలువురు గాయపడిన విషయం తెలిసిందే.శ్రీనగర్‌లోనూ, లోయలోని ఇతర ప్రాంతాలలోనూ ప్రభుత్వ వాహనాలు నామమాత్రంగానే కన్పించాయి. ప్రైవేటు వాహనాలు మాత్రం మామూలుగానే తిరిగాయి. ప్రైవేటు పాఠశాలలను మూసివేయగా ప్రభుత్వ పాఠశాలలు తెరిచే ఉన్నాయి. కాశ్మీర్ వాణిజ్య పరిశ్రమల మండలి (కేసీసీఐ), కాశ్మీర్ వ్యాపారులు-ఉత్పత్తిదారుల సమాఖ్య (కేటీఎంఎఫ్), మత సంస్థ ముత్తాహిదా మజ్లిస్ ఉలేమా (ఎంఎంయూ), జమ్మూకాశ్మీర్‌కు చెందిన గ్రాండ్ ముఫ్తి నసీరుల్ ఇస్లాం సంయుక్తంగా బంద్‌కు పిలుపునిచ్చాయి. 'ఇలాంటి హింసాత్మక చర్యలు ఆమోదయోగ్యం కావు. మన సమాజంలో వీటికి స్థానం లేదు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అందరూ సంఘటితం కావాలి. శాంతియుత, సామ రస్యపూర్వకమైన సమాజం కోసం కృషి చేయాలి." అని గ్రాండ్ ముఫ్తి ఒక ప్రకటనలో కోరారు. జమ్మూ ప్రాంతంలో కూడా బంద్‌కు పూర్తి మద్దతు లభించింది. జమ్మూ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, జమ్మూ బార్ అసోసియేషన్ పూర్తి బంద్‌కు పిలుపునిచ్చాయి. జమ్మూ నగరంలోనూ, ఇతర ప్రధాన ప్రాంతాలలోనూ బంద్ దృశ్యాలు కన్పించాయి. బంద్‌కు రాజకీయ పార్టీలు, నేతలు మద్దతు తెలిపారు. బాధితులకు సంఘీభావం ప్రకటించారు. లోయ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా కీలక పర్యాటక ప్రదేశాల వద్ద అదనపు దళాలను మోహరించారు. నిత్యావసరాలను విక్రయించే దుకాణాలను మాత్రమే అనుమతించారు. లోయలోని అన్ని జిల్లా కేంద్రాలలోనూ బంద్ ప్రభావం బాగా కన్పించింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రజలు, రాజకీయ పార్టీలు, మత సంస్థలు, పౌర సమాజ గ్రూపులు సంఘటితమై ఈ విధంగా బలమైన సందేశాన్ని పంపడం ఇటీవలి కాలంలో చాలా అరుదైన విషయం.



# తిరుమలలో చోడవరం భక్తుల కోలాటం



**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 24:** తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద చోడవరం భక్తులు గురువారం కోలాటం చేశారు. స్థానిక లలిత జ్యోతి కోలాటం బృందం 18 మంది ముందుగా అరుణాచలంలోని శివపార్వతుల ఆలయంలో కోలాటం చేసి, అనంతరం గోల్డెన్ టెంపుల్ (శ్రీపురం), కాణిపాకంలో కోలాటం చేసి గురువారం తిరుమల చేరుకొని మెట్లు ఉత్సవంలో పాల్గొని కోలాటం చేశారు. శ్రీవారి ఉత్సవ విగ్రహాలు స్వామి మెట్లు మీదగా వెళు తుండగా వెనక మెట్లు మీద చోడవరం భక్తులు కోలాటం చేసి తిరుమల చేరుకున్నారు. స్వామి దర్శనం అనంతరం చోడవరం తిరిగి వస్తారు.

## పీలా రమాదేవికి గేదెల సత్యనారాయణ సత్కారం

**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 24:** విశాఖ డైయిరీ డైరెక్టర్, ఎలమంచిలి మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ పీలా రమాదేవిని డైయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఘనంగా సత్కరించి ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గేదెల సత్యనారాయణ, గోకివాడ కోటేశ్వరరావు, తమరాన దాసు, డొంకిన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



# గాజాలో డయాలసిస్ రోగుల అవస్థలు

**గాజా :** గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దిగ్బంధనం కారణంగా ఆహార పదార్థాలు, ఔషధాలు, ఇతర నిత్యావసరాలు అందక ప్రజలు అల్లాడిపోతున్నారు. దీనికితోడు మందులు, ఇతర అత్యవసర వైద్య చికిత్సలు అందక రోగులు వందల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. వారానికి నాలుగుసార్లు డయాలసిస్‌పై ఆధారపడి రోజులు వెళ్లదీసే రోగుల అవస్థలు చెప్పనక్కరలేదు. మార్చి ప్రారంభం నుండి ఇప్పటివరకు 11మంది రోగులు సకాలంలో వైద్యం అందక మరణించారు. కిడ్నీలు విఫలమై 417మంది మరణించారని అల్ షిఫా ఆస్పత్రిలో డయాలసిస్ విభాగ అధిపతి డాక్టర్ ఘజీ చెప్పారు. మొత్తంగా యుద్ధం ప్రారంభమైన తర్వాత 1100మందికి పైగా రోగులు మృత్యువాత పడ్డారు. గాజావ్యాప్తంగా ఆస్పత్రులన్నీ దాడుల్లో ధ్వంసం కావడంతో డయాలసిస్ కోసం వారంలో రెండుసార్లు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి. లేనిపక్షంలో శరీరమంతా ఉబ్బిపోయి, విషపూరితమయ్యే దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నామని, ఒకోసారి అవి మరణానికి దారి తీస్తున్నాయని డాక్టర్ ఘజీ చెప్పారు. నగరానికి పశ్చిమాన గల తాత్కాలిక శిబిరాల నుండి ఉత్తర ప్రాంతంలోని షిఫా అస్పత్రికి వెళ్లడమంటే వారికి అత్యంత ఇబ్బందికరంగా మారుతోంది. 54 ఏళ్ల మహ్మద్ అతియా దాదాపు 15ఏళ్ల నుండి కిడ్నీ వైఫల్యంతో బాధపడుతూ డయాలిసిస్‌పై జీవిస్తూ, వీల్ ఛైర్‌కే పరిమితమయ్యారు. రోగికి వారానికి కనీసం మూడుసార్లు డయాలసిస్ అవసరం, ప్రతీసారి నాలుగు గంటలు చొప్పున ఈ ప్రక్రియ వుంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు సార్లు మాత్రమే చేయడానికి సాధ్యమవుతోందని, అది కూడా రెండు నుండి మూడు గంటల్లోనే ముగించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా నెలకొన్న దుర్భర పరిస్థితుల్లో సరైన సరఫరాలు, సదుపాయాలు లోపించడంతో తన రక్తంలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించుకోలేని పరిస్థితి నెలకొందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత దిగ్బంధన చర్యలపై వ్యాఖ్యానించడానికి ఇజ్రాయిల్ మిలటరీ సంస్థ ఇన్‌చార్జి సిఓజిఎటి (కోఆర్డినేషన్ ఆఫ్ గవర్నమెంట్ యాక్టివిటీస్ ఇన్ ది టెరిటరీస్) నిరాకరించారు. గాజా లోపలకు ప్రవేశించడానికి అనుమతులు లేక టన్నుల కొద్దీ మందులు, ఇతర వైద్య పరికరాలు, సామాగ్రి గాజా సరిహద్దుల్లో పడివున్నాయి. యుద్ధంతో గాజాలో మొత్తంగా ఆరోగ్య వ్యవస్థ చిన్నాభిన్నమైంది.



# న్యూజెర్సీ నుండి 3,000 మంది నివాసితుల తరలింపు

**న్యూయార్క్ :** అమెరికాలోని న్యూజెర్సీలో కార్చిచ్చు వ్యాపించడంతో సుమారు 3,000మంది నివాసితులను ఖాళీ చేయించారు. కార్చిచ్చుతో వేలాది ఎకరాలు దగ్ధమయ్యాయని, వందలాది నిర్మాణాలకు ముప్పు కలిగిస్తోందని రాష్ట్ర అగ్నిమాపక దళం మంగళవారం తెలిపింది. రాత్రి 10.30 గంటలకు ఓషన్ కౌంటీలో కార్చిచ్చు ప్రారంభమైందని, పది శాతం అదుపులోకి వచ్చాయని న్యూ జెర్సీ ఫారెస్ట్ ఫైర్ సర్వీస్ సోషల్‌మీడియా ఖాతా ఎక్స్‌లో పేర్కొంది. 3,200 ఎకరాల్లో మంటలు చెలరేగాయని మొదట నివేదించింది. రెండు గంటల అనంతరం మంటలు 8,500 ఎకరాల (3,440 హెక్టార్లు)కు వ్యాపించాయని పేర్కొంది. అగ్నిమాపక యంత్రాలు, బుల్డోజర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందితో పాటు అనేక మంది అగ్నిమాపక, రెస్క్యూ సిబ్బందిని మోహరించినట్లు అగ్నిమాపక సంస్థ తెలిపింది. కార్చిచ్చు చెలరేగడానికి గల కారణాలపై విచారణ చేపడుతున్నట్లు వెల్లడించింది. ఈ అంశంపై బుధవారం మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. అమెరికా తూర్పు తీరంలో అతిపెద్ద రక్షిత ప్రాంతాలలో ఒకటైన పైన్ బారెన్స్‌లో మంటలు చెలరేగాయని స్థానిక మీడియా తెలిపింది. న్యూజెర్సీని కరువు ప్రాంతంగా రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ శాఖ మార్చిలో ప్రకటించింది. కార్చిచ్చుతో సుమారు 25,000 మందికి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని జెర్సీ సెంట్రల్ పవర్ అండ్ లైట్ ఎక్స్‌లో పేర్కొంది. కార్చిచ్చు కారణంగా న్యూజెర్సీ రాష్ట్రం గుండా వెళ్లే గార్డెన్ స్టేట్ పార్క్‌వేలోని ఒక విభాగాన్ని కూడా మూసివేసినట్లు తెలిపారు.



# మేఘా ఇంజనీరింగ్ మరో అరుదైన ఘనత..



మేఘా ఇంజనీరింగ్ సంస్థ మరో అరుదైన ఘనత సాధించింది. కర్ణాటక రాష్ట్రంలోని కైగా వద్ద 700 మెగావాట్స్ ఎలక్ట్రిక్ సామర్థ్యం కలిగిన రెండు అణు రియాక్టర్ యూనిట్ల నిర్మాణానికి సంబంధించి పర్చేజ్ ఆర్డర్ ను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ అందుకుంది. ముంబైలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీనియర్ అధికారుల నుండి పర్చేజ్ ఆర్డర్ ను ఎంఈఐఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సి.హెచ్. సుబ్బయ్య అందుకున్నారు. కైగా యూనిట్లు 5, 6 అణు రియాక్టర్లను ఎన్పీసీఐఎల్ కోసం ఎంఈఐఎల్ నిర్మించనుంది. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో ఎంఈఐఎల్ ఈ అణు రియాక్టర్ల నిర్మాణాన్ని చేపట్టనుంది. ఇప్పటి వరకు ఎన్పీసీఐఎల్ ఏకమొత్తంగా ఇచ్చిన అతిపెద్ద ఆర్డర్ ఇదే. బీహెచ్ఈఎల్, ఎల్ అండ్ టీ వంటి ఇతర ప్రముఖ బిడ్డర్లతో పోటీ పడి ఈ కాంట్రాక్టును ఎంఈఐఎల్ దక్కించుకోవడం విశేషం. ఈ ప్రతిష్టాత్మక ఈపీసీ కాంట్రాక్ట్ ఎంఈఐఎల్‌కు లభించడం, భారతదేశ ఇంధన మౌలిక సదుపాయాల అభివృద్ధికి కంపెనీ చేస్తున్న కృషిని తెలియజేస్తోంది. మొట్టమొదటిసారిగా ఈ టెండర్ ప్రక్రియలో క్వాలిటీ-కమ్-కాస్ట్-బెస్ట్ సెలెక్షన్ (క్యూసీబీఎస్) విధానాన్ని ఎన్పీసీఐఎల్ అవలంబించింది. టెండర్ కేటాయింపులో సాంకేతిక నైపుణ్యం, ఖర్చు సామర్థ్యం రెండింటినీ సమతుల్యంగా అంచనా వేసింది. పర్చేజ్ ఆర్డర్ ను అందుకున్న సందర్భంగా ఎంఈఐఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సుబ్బయ్య మాట్లాడుతూ తమ సంస్థ అత్యుత్తమ సాంకేతిక సామర్థ్యానికి, పోటీ తత్వానికి ఈ కాంట్రాక్టు సాధించటం ఓ నిదర్శనం అన్నారు. కైగా అణు రియాక్టర్ల నిర్మాణ ప్రాజెక్ట్ దేశ ఇంధన భవిష్యత్తుకు కీలకమైన అణు ఇంధన రంగంలోకి తమ సంస్థ వ్యూహాత్మక ప్రవేశాన్ని సూచిస్తుందని, ఎంఈఐఎల్‌కు ఇంజినీరింగ్ నైపుణ్యం, ఆవిష్కరణల పట్ల ఉన్న నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందని అన్నారు. తాము అత్యున్నత ప్రమాణాలు, భద్రత, విశ్వసనీయతకు కట్టుబడి ఉంటూనే, ప్రాజెక్ట్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. దేశ, విదేశాలలో పెద్ద ఎత్తున ఈపీసీ ప్రాజెక్ట్‌లను విజయవంతంగా పూర్తి చేసిన బలమైన ట్రాక్ రికార్డ్, అణు శక్తి రంగంలో మన దేశ స్వావలంబనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించడానికి ఎంఈఐఎల్ సిద్ధంగా ఉందని సుబ్బయ్య తెలిపారు.

# భారత వృద్ధి అంచనాలకు ప్రపంచ బ్యాంక్ కోత




భారత వృద్ధి రేటు అంచనాలకు ప్రపంచ బ్యాంక్ కోత పెట్టింది. దేశంలో మూలధన వ్యయాల తగ్గుదలకు తోడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో బలహీనత, అమెరికా విధాన అనిశ్చితి నేపథ్యంలో భారత జీడిపి 0.4 శాతం తగ్గి 6.3 శాతానికి పరిమితం కావొచ్చని విశ్లేషించింది. ఇంతక్రితం ఈ అంచనా 6.7 శాతంగా ఉంది. భారత్‌లో ప్రయివేటు పెట్టుబడులు, ప్రభుత్వ మూలధన వ్యయాలు నెమ్మదించడం వల్ల గడిచిన 2024-25లోనూ వృద్ధి నిరాశపర్చిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. ప్రభుత్వం తన లక్ష్యాలను చేరుకో లేదని వెల్లడించింది. గడిచిన 2024-25లో జీడిపి 6.5 శాతానికి మందగించనుందని విశ్లేషించింది. ఇంతక్రితం రోజూ అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) కూడా భారత జీడిపి అంచనాలకు కోత పెట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుత 2025-26లో వృద్ధి 6.2 శాతానికి పరిమితం కావొచ్చని.. ఇంతక్రితం 6.5 శాతం అంచనాతో పోల్చితే 0.3 శాతం తగ్గనుందని ఐఎంఎఫ్ పేర్కొంది.

# రూ.12,800 కోట్లతో రెండు అణు రియాక్టర్ల నిర్మాణం

కర్ణాటక రాష్ట్రంలోని కైగా వద్ద 700 మెగావాట్స్ ఎలక్ట్రిక్ సామర్థ్యం కలిగిన రెండు అణు రియాక్టర్ యూనిట్ల నిర్మాణానికి సంబంధించి పర్చేజ్ ఆర్డర్‌ను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) దక్కించుకుంది. ముంబయిలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐఎల్) సీనియర్ అధికారుల నుండి పర్చేజ్ ఆర్డర్‌ను ఎంఇఐఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సిహెచ్ సుబ్బయ్య అందుకున్నారు. కైగా యూనిట్లు 5, 6 అణు రియాక్టర్లను ఎన్‌పిసిఐఎల్ కోసం ఎంఇఐఎల్ నిర్మించి ఇవ్వనుందని సుబ్బయ్య తెలిపారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్మెంట్, కన్స్ట్రక్షన్ (ఇపిసి) విధానంలో ఎంఇఐఎల్ ఈ అణు రియాక్టర్ల నిర్మాణాన్ని చేపట్టనున్నామన్నారు. ఇప్పటి వరకు ఎన్‌పిసిఐఎల్ ఏకమొత్తంగా ఇచ్చిన అతిపెద్ద ఆర్డర్ ఇదేనన్నారు. తమ సంస్థ అత్యుత్తమ సాంకేతిక సామర్థ్యానికి, పోటీ తత్వానికి ఈ కాంట్రాక్టు సాధించటం ఓ నిదర్శనమన్నారు.



# బంగారం స్వచ్ఛతకు లెక్కలుంటాయి.. ఆ నంబర్ల వెనుకున్న అర్థం ఇదే..!



బంగారమంటే భారతీయులకు ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పండగలు, శుభకార్యాలు, పుట్టినరోజులు.. ఇలా ప్రతిసారి దీనికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. మహిళలు బంగారు ఆభరణాలను ధరించడానికి బాగా ఇష్టపడతారు. తాము పొదుపు చేసుకున్న డబ్బులతో వాటినే ఎక్కువగా కొనుగోలు చేస్తారు. అయితే బంగారాన్నికొనడానికి అక్షయ తృతీయ రోజు మంచి ముహూర్తమని భావిస్తారు. ఈ రోజునే సమీపంలోని బంగారం దుకాణాల వద్దకు వెళ్లి తమ స్థోమతకు తగినట్టుగా కొనుగోలు జరుపుతారు. అయితే బంగారం కొన్నప్పుడు వాటి స్వచ్ఛత స్థాయిపై అవగాహన ఉండాలి. సాధారణంగా బంగారు ఆభరణాలను కొనుగోలు చేసినప్పుడు వాటి స్వచ్ఛతను 22, 24 కేరెట్ల రూపంలో చెబుతారు. బంగారు నాణేలు, కడ్డీలను కొనుగోలు చేసినప్పుడు వాటిపై 999, 995 అనే గుర్తులు ఉంటాయి. వాటికి గురించి చాలా మందికి పూర్తిస్థాయిలో అవగాహన ఉండదు. ఈ నంబర్లు బంగారం స్వచ్ఛతకు చిహ్నాలుగా చెప్పవచ్చు. 24 కేరెట్ల బంగారమంటే పూర్తిస్థాయి స్వచ్ఛమైనది అని అర్థం. దీనిలో ఎటువంటి లోహాలు కలవవు. 99.99 శాతం స్వచ్ఛత స్థాయి ఉంటుంది. కానీ ఇది ఆభరణాల తయారీకి పనికి రాదు. ఎందుకంటే బంగారంలో మరో లోహం కలిస్తేనే ఆభరణాలను తయారు చేయడానికి వీలుంటుంది. బంగారం కడ్డీలు, నాణేలపై 999 (99.9 శాతం), 995 (99.5 శాతం) నంబర్లు ఉంటే అది 24 కేరెట్ల స్వచ్ఛమైన బంగారం అని అర్థం. ఆ నంబర్లు స్వల్ప తేడాలతో ఒకే నాణ్యతను కలిగి ఉంటాయి. బంగారం స్వచ్ఛత పెరిగే కొద్దీ దాని ధర కూడా ఎక్కువవుతుంది. అక్షయ తృతీయ రోజు బంగారం కొనాలనుకునే వారికి నాణేలు, కడ్డీలు బాగుంటాయి. వాటితో పండగ రోజు మేలిమి బంగారం కొనుగోలు చేసిన అనుభూతి కలుగుతుంది. 24 కేరెట్ల (24 కె) బంగారం అత్యంత స్వచ్ఛమైనదని చెబుతున్నా.. ఆ నాణ్యతతో తయారు చేసిన ఆభరణాలు చాలా తక్కువగా ఉంటాయి. ఎక్కువగా 22 కె, 18 కెతో తయారు చేసిన వస్తువులే దుకాణాల్లో లభిస్తాయి. దీని వెనుక ఉన్న కారణం ఏమిటంటే బంగారంలో ఇతర లోహాలు కలిస్తేనే ఆభరణాలు గట్టిగా ఉంటాయి. చక్కని డిజైన్ తో రూపొందించడానికి వీలు కలుగుతుంది. కాబట్టి చాలా మంది వ్యాపారులు ఆ నాణ్యతతోనే ఆభరణాలను తయారు చేస్తారు. అక్షయ తృతీయ రోజు కొనుగోలు చేయడానికి 24 కేరెట్ల బంగారం దొరకలేదని నిరాశ చెందనవసరం లేదు. దుకాణాల్లో 24 కేరెట్ల పెండెంట్లు, నాణేలు, చిన్న పూజా వస్తువులు లభిస్తాయి. ఇప్పుడిప్పుడే మన దేశంలో 23 కేరెట్ల ఆభరణాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. భారత ప్రభుత్వం 2021 నుంచి ఆరు స్వచ్ఛత స్థాయిలలో బంగారు వస్తువులకు హాల్ మార్కింగ్ ను తప్పనిసరి చేసింది.

# 13 ఏళ్లకే కంపెనీకి సీఈవో.. కేరళ బాలుడి విజయగాథ..!



సాధారణంగా 13 ఏళ్ల వయసున్న పిల్లలు స్కూల్లో 8వ తరగతి చదువుతూ ఉంటారు. పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత తోటి పిల్లలతో ఆడుకుంటారు. లేకపోతే ట్యూషన్ కు వెళుతూ చదువులో బిజీగా ఉంటారు. తల్లి లేదా తండ్రి మొబైల్ తీసుకుని గేమ్స్ ఆడతారు. కానీ అదే వయసున్న ఆదిత్యన్ రాజేష్ ఒక మొబైల్ అప్లకేషన్ ను డెవలప్ చేసి తన సొంత ఐటీ కంపెనీని స్థాపించాడు. ఇతడి యూట్యూబ్ చానల్ కు లక్షల మంది సబ్ స్రైబర్లు ఉన్నారు. ఆదిత్యన్ జీవితం అందరికీ ఆదర్శవంతంగా మారింది. పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకుని జీవితంలో విజయం సాధించాడు. అతడు కేరళ రాష్ట్రంలోని తిరువల్లాలో జన్మించాడు. ప్రస్తుతం దుబాయ్ లో నివసిస్తున్నాడు. ఐదేళ్ల వయసులోనే అతడికి కంప్యూటర్ పై ఆసక్తి పెరిగింది. దానికి కారణం అతడికి తక్కువ మంది స్నేహితులు ఉండడమే. దీంతో అతడు టెక్నాలజీతో స్నేహం చేశాడు. దానిలో మెళకువలను నేర్చుకున్నాడు. సరదాగా మొదలైన ఆ ప్రయాణం అతడిని విజయ తీరాలకు చేర్చింది. ఆదిత్యన్ ముందుగా యూట్యూబ్ లో ఆటలు నేర్చుకున్నాడు. స్పెల్లింగ్ బీస్ లో పాల్గొనేవాడు. అనంతరం కోడింగ్ , డిజైనింగ్ పై ఆసక్తి పెరిగి, వాటిలో నైపుణ్యం సాధించాడు. దాదాపు ఆరేళ్ల వయసులోనే హెచ్ టీఎంఎల్, సీఎస్ఎస్ తదితర కోడింగ్ భాషలను నేర్చుకోవడం ప్రారంభించాడు. టెక్నాలజీపై ఉన్న ఇష్టమే అతడిని ప్రపంచంలో ప్రత్యేకమైన వ్యక్తిగా నిలబెట్టింది. కోడింగ్ నేర్చుకున్న తర్వాత తొమ్మిదేళ్ల వయసులో ఆదిత్యన్ తన మొదటి ఆండ్రాయిడ్ యాప్ ను తయారు చేశాడు. అది విజయవంతంగా పని చేయడంతో అతడిలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అది ప్రయాణానికి ప్రోత్సాహం అందజేసింది. చిన్నపిల్లవాడి సాంకేతిక నైపుణ్యానికి అందరూ ఆశ్చర్యపోయారు. ప్రస్తుతం ఐఫోన్ లో ఉపయోగించే సాఫ్ట్ వేర్ కోసం ఒక యాప్ ను డెవలప్ చేయాలని ఆదిత్యన్ ఆకాంక్షిస్తున్నాడు. యాప్ ను తయారు చేయడంతోనే ఆదిత్యన్ ఆగిపోలేదు. ఏ క్రేజ్ అనే పేరుతో యూ ట్యూబ్ చానల్ ను కూడా నిర్వహిస్తున్నాడు. దీని ద్వారా టెక్నాలజీ, కోడింగ్ గేమింగ్, వెబ్ డిజైనింగ్ గురించిన సమాచారాన్ని తన యూజర్లకు తెలియజేస్తారు. ఇతడి యూట్యూబ్ కు అనేక మంది సబ్ స్క్రైబర్లు ఉన్నారు. ట్రైనెట్ సొల్యూషన్స్ అనే సాఫ్ట్ వేర్ డెవలప్ మెంట్ కంపెనీని తన స్నేహితులతో కలిసి స్థాపించాడు. అది క్షూడా కేవలం 13 ఏళ్ల వయసులోనే కావడం విశేషం. ఈ కంపెనీ ఇప్పటి వరకూ 12 మంది క్లయింట్ల కోసం ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసింది. ప్రపంచ వ్యాప్తంగా తన కంపెనీ విస్తరించడమే ఆదిత్యన్ రాజేష్ లక్ష్యం.

# రివర్స్‌గేర్‌లో టెస్లా

**- ట్రంప్ సర్కారుకు సేవలను తగ్గించుకోనున్న మస్క్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు ఎలాన్ మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల కంపె నీ టెస్లా పనితీరు బాగా క్షీణించింది. జనవరి-మార్చి త్రైమాసికంలో కంపెనీ నికర లాభం వార్షి క ప్రాతిపదికన 71 శాతం పతనమై 40.9 కోట్ల డాలర్లకు పడిపోయింది. ఆదాయం 9 శాతం క్షీణించి 1,930 కోట్ల డాలర్లకు తగ్గింది. అంతేకాదు, గడిచిన మూడు నెలల్లో కంపెనీ వాహన విక్రయాలు సైతం 13 శాతం తగ్గాయి. సంస్థ పేలవ పనితీరు నేపథ్యంలో ట్రంప్ సర్కారుకు తన సేవలను గణనీయంగా తగ్గించుకోవడంతో పాటు టెస్లా కార్యకలాపాలపై దృష్టి పెంచాలని మస్క్ గట్టి నిర్ణయం తీసుకున్నారు. వచ్చే నెల నుంచి ట్రంప్ సర్కారు కోసం కేవలం ఒకటి లేదా రెండ్రోజులు మాత్రమే కేటాయిస్తానని టెస్లా ఇన్వెస్టర్లతో అన్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టాక ప్రభుత్వ వ్యయాల్ని, ఉద్యోగుల్ని తగ్గించే బాధ్యతల్ని మస్క్‌కు అప్పగించారు. ఇందుకోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజే) పేరుతో ఏర్పాటు చేసిన శాఖకు ప్రస్తుతం మస్క్ సార థ్యం వహిస్తున్నారు. అయితే, సర్కారు కోసం మస్క్ పనిచేయడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇది టెస్లా కార్ల అమ్మకాలతోపాటు పనితీరుపైనా తీవ్ర ప్రభావం చూపిం ది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు టెస్లా షేర్లు 41 శాతం క్షీణించాయి.



PEN SATTA
Telugu Daily
పెన్ సత్తా
తెలుగు దిన పత్రిక
Anakapalli
25-04-2025

# వెంకీ, నాని మల్టీస్టారర్ మిస్సయ్యిందా



పైన హెడ్డింగ్ చదవగానే అరే మిస్సయ్యామే అనే ఫీలింగ్ ఎవరికైనా కలుగుతుంది. అలాంటిదే అభిమానులు ఎదురు చూస్తున్న విక్టరీ వెంకటేష్, న్యాచురల్ స్టార్ నాని కలయిక. హిట్ 3 ది థర్డ్ కేస్ ప్రమోషన్లలో భాగంగా బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో నాని ఈ విశేషం పంచుకున్నాడు. దాని ప్రకారం ఈ కాంబినేషన్ తో దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఒక సినిమా అనుకున్నారట. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ఎందుకనేది తెలియదు కానీ ఈ మధ్య మాటల మాంత్రికుడిని కలిసే సందర్భం రాలేదు కాబట్టి ఇంతకన్నా ప్రస్తుతానికి ఏం చెప్పలేనని, ఏం జరుగుతుందో తెలియదని అక్కడితో టాపిక్ ముగించాడు.అంటే కొద్దివారాల క్రితం త్రివిక్రమ్ ఇలాంటి ప్లానింగ్ లో ఉన్నాడనే లీక్ వచ్చినప్పుడు నిజమా కాదా అనే సందిగ్ధత ఫ్యాన్స్ లో ఉండిపోయింది. అయితే అది వెంకీ, నానితో కలిసి అనేది మాత్రం ఎవరూ ఊహించలేదు. అల్లు అర్జున్ 23 కోసం స్క్రిప్ట్ పనుల్లో ఉన్న త్రివిక్రమ్ దీనికన్నా ముందు బన్నీ అట్లీ సినిమా పూర్తి చేయాలి కాబట్టి ఎక్కువ సమయం దొరికే అవకాశాన్ని దక్కించుకున్నాడు. అప్పటి దాకా వెయిట్ చేయడం కన్నా ఈలోగా ఒక ప్రాజెక్టు చేసేయొచ్చనే ఆలోచనలో ఆయన ఉన్నట్టు టాక్ వచ్చింది. నేరుగా త్రివిక్రమ్ నే అడుగుదామంటే వేరే ఈవెంట్లకు సైతం గెస్టుగా రానంత బిజీగా ఉండటంతో సాధ్యం కాలేదు. సరే ఇప్పుడు కాకపోయినా భవిష్యత్తులో ఈ కాంబో కుదిరితే బాగుంటుంది. భలే భలే మగాడివోయ్ నాని, నువ్వు నాకు నచ్చావ్ వెంకటేష్ తో కలిసి మల్లేశ్వరి మార్కు ఎంటర్ టైన్మెంట్ త్రివిక్రమ్ డైరెక్షన్లో ఇస్తే ఆ ఫన్ వేరే లెవెల్ లో ఉంటుంది. నాని ఎదురు చూస్తున్నాడు కానీ ఇప్పట్లో జరిగేలా లేదు. హిట్ 3 ది థర్డ్ కేస్ తర్వాత ప్యారడైజ్ చేయబోతున్న నాని ఆ తర్వాత సుజిత్ తో చేతులు కలుపుతాడు. కాకపోతే పవన్ కళ్యాణ్ ఓజిని పూర్తి చేసుకుని వచ్చే కండిషన్ తో. ఎలాగూ అది ఈ ఏడాదే రిలీజ్ అవుతుంది కనక రూట్ క్లియర్ గా ఉంది. ఏది ఏమైనా నాని ప్లానింగ్ చూస్తుంటే మాత్రం మిగిలినోళ్లకు ముచ్చటగా, ఈర్ష్యగా అనిపిస్తుంది.

# సితారే జమీన్ పర్.. ఈసారి కన్నీళ్లు కాదు



ఆమిర్ ఖాన్ కెరీర్లో ఎన్నో బ్లాక్ బస్టర్లు ఉన్నాయి. కానీ ఆయన సినిమాల్లో 'తారే జమీన్ పర్' చాలా స్పెషల్. నటుడిగా మాత్రమే కాక దర్శకుడిగానూ తనదైన ముద్ర వేసిన సినిమా అది. ఆమిర్ డైరెక్ట్ చేసిన ఏకైక చిత్రమిది. తొలి చిత్రమే అయినా.. భావోద్వేగాలను అద్భుతంగా పండించి మెప్పించాడు. ఆ సినిమా చూసి కన్నీళ్లు పెట్టని వాళ్లుండరు అంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా పతాక సన్నివేశాల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇండియన్ ఫిలిం హిస్టరీలోనే అత్యంత గొప్ప చిత్రాల్లో ఒకటిగా 'తారే జమీన్ పర్' గుర్తింపు తెచ్చుకుంది. ఆమిర్ హీరోగా పీక్స్‌లో ఉండగా ఈ సినిమా తీసి దర్శకుడిగా కూడా గొప్ప పేరు సంపాదించాడు.ఐతే ఇప్పుడు హీరోగా ఎన్నడూ లేని స్లంప్ చూస్తున్న దశలో ఆమిర్ మళ్లీ మెగా ఫోన్ పట్టాడు. 'తారే జమీన్ పర్'కు కొనసాగింపుగా 'సితారే జమీన్ పర్' తీస్తున్నాడు. ఈ సినిమా గురించి తొలిసారి ఓపెన్ అయ్యాడు ఆమిర్. 'తారే జమీన్ పర్' లాగా ఇది ఎమోషనల్ సినిమా కాదని ఆమిర్ చెప్పడం విశేషం. ఆ సినిమాలో ప్రేక్షకులను ఏడిపించామని.. ఈ సినిమాలో నవ్వించడమే ప్రధాన లక్ష్యమని ఆమిర్ తెలిపాడు. "సితారే జమీన్ పర్ చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ కథ దివ్యాంగుల నేపథ్యంలో నడుస్తుంది. 'తారే జమీన్ పర్' మిమ్మల్ని ఏడిపించింది. కానీ 'సితారే జమీన్ పర్' నవ్విస్తుంది. తొలి చిత్రంలో నేను సున్నితమైన భావాలున్న వ్యక్తిగా నటించాను. కానీ ఇందులో నా పాత్ర భిన్నంగా, పూర్తి వ్యతిరేకంగా ఉంటుంది. నా పాత్ర రాజకీయ నాయకులతో దురుసుగా ప్రవర్తిస్తుంది. కుటుంబ సభ్యులతోనూ గొడవపడి అవమానిస్తుంటుంది. ఎన్నో అంతర్గత సమస్యలతో బాధ పడే వ్యక్తి మంచివాడిగా ఎలా మారాడాన్నదే ఈ కథ" అని ఆమిర్ తెలిపాడు. ఈ ఏడాది ద్వితీయార్ధంలో 'సితారే జమీన్ పర్' విడుదలవుతుంది.

# ఉగ్రదాడిపై సాయి పల్లవి ట్వీట్..



జమ్మూ కశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని సినీతారలు ఖండిస్తున్నారు. ఈ ఘటనలో 27 మంది చనిపోవడం ఎంతో బాధాకరమంటూ ట్వీట్స్ చేశారు. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ లోయలో జరిగిన రక్తపాతంపై దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. అటు ప్రపంచ దేశాలు సైతం భారత్ కు అండగా నిలబడుతున్నాయి. ఇప్పటికే ఈ ఘటనపై టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలకు చెందిన స్టార్స్ రియాక్ట్ అయ్యారు. తాజాగా న్యాచురల్ బ్యూటీ సాయి పల్లవి సైతం ఉగ్రదాడి పై స్పందిస్తూ నెట్టింట సుదీర్ఘ ట్వీట్ చేసింది. దీంతో గతంలో ఆమెకు సంబంధించిన ఓ ఇంటర్వ్యూ వీడియోనూ నెట్టింట షేర్ చేస్తూ మండిపడుతున్నారు నెటిజన్స్. ఇంతకీ అసలే జరిగిందంటే.. ఉగ్రదాడిపై సాయి పల్లవి స్పందిస్తూ.. "పహల్గాం దాడిలో జరిగిన నష్టం, కలిగిన బాధ, ఏర్పడిన భయం నాకు వ్యక్తిగతంగా జరిగినట్లు అనిపిస్తోంది. చరిత్రలో జరిగిన భయంకరమైన నేరాల గురించి తెలుసుకుని.. ఇప్పటికీ అలాంటి అమానవీయ చర్యలకు సాక్షిగా ఉండడం వల్ల.. అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ ఏమి మారలేదని అర్థమవుతుంది. ఆ జంతువుల సమూహం మిగిలి ఉన్న ఆ కొద్దిపాటి ఆశను తుడిచిపెట్టేసింది. కుటుంబంతో జ్ఞాపకాలను సృష్టించాలనుకునే మనస్తత్వం నుండి, మీ ఎమోషన్స్, మీ కుటుంబం మీ ముందే కోల్పోవడం చూడడం వరకు.. ఇది నన్ను మన మూలాన్ని ప్రశ్నించేలా చేస్తుంది. నిస్సహాయంగా, శక్తిహీనులుగా, కోల్పోయిన అమాయక జీవితాలు, వేదనకు గురైన కుటుంబాల కోసం నా హృదయపూర్వక సంతాపాన్ని , ప్రార్థనలను అందిస్తున్నాను " అంటూ ట్వీట్ చేసింది.

# పూరి సినిమా.. అతను గానీ ఒప్పుకుంటే



'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో గాడిన పడ్డట్లే పడి.. ఆ తర్వాత 'లైగర్', 'డబుల్ ఇస్మార్ట్' చిత్రాలతో ఎదురు దెబ్బలు తిన్నాడు సీనియర్ డైరెక్టర్ పూరి జగన్నాథ్. మామూలుగా చివరి చిత్రం ఫలితం ఎలా ఉన్నా.. వెంటనే తర్వాతి చిత్రాన్ని మొదలుపెట్టేస్తుంటాడు పూరి. కానీ ఈసారి మాత్రం ఇబ్బంది తప్పలేదు. టాలీవుడ్ స్టార్లలో ఎవ్వరూ ఆయనతో సినిమా చేయడానికి రెడీగా లేని పరిస్థితి. నిర్మాత దొరకడమూ కష్టమైంది. ఐతే విజయ్ సేతుపతి లాంటి విలక్షణ నటుడికి కథ చెప్పి మెప్పించడంతో పూరి మళ్లీ ప్రేక్షకులతో పాటు నిర్మాతల దృష్టిని కూడా ఆకర్షించగలిగాడు. ఈ కలయికలో త్వరలోనే సినిమా సెట్స్ మీదికి వెళ్లబోతోంది. టబు, రాధికా ఆప్టే లాంటి ఆర్టిస్టులు ఈ ప్రాజెక్టులోకి రావడంతో క్రేజ్ ఇంకా పెరిగింది. మరోవైపు సినిమాలో అత్యంత కీలకమైన విలన్ పాత్ర కోసం సరైన నటుడిని ఎంచుకోవాలని చూస్తున్నాడు పూరి. అందుకోసం ఆయన ఫస్ట్ ఛాయిస్ ఫాహద్ ఫాజిల్ అట. అతడికి పూరి కథ కూడా చెప్పాడు. అతడికి నచ్చిందని సమాచారం. కానీ సౌత్ ఇండియాలో బిజీయెస్ట్ యాక్టర్లలో ఒకడైన ఫాహద్.. ఈ సినిమాకు డేట్లు సర్దుబాటు చేయడానికి ఇబ్బందిపడుతున్నాడట. ఇంతకుముందు సేతుపతి, ఫాహద్ కలిసి 'విక్రమ్'లో నటించారు. ఈ కాంబో బాగా వర్కవుట్ అయింది. అందులో సేతుపతి విలన్‌గా చేశాడు. ఫాహద్‌ది సహాయ పాత్ర. కానీ ఈసారి అతను హీరోగా నటిస్తే.. ఫాహద్ విలన్ పాత్ర చేయాల్సి ఉంది. ఈ కలయిక మరింత ఆసక్తిని రేకెత్తిస్తుందనడంలో సందేహం లేదు. ఐతే పూరి ఎవరి కోసం ఎక్కువ రోజులు ఎదురు చూసే రకం కాదు. అందుకోసం ప్రత్యామ్నాయాలు కూడా చూసి పెట్టుకున్నాడు. 'యానిమల్'తో వెలుగులోకి వచ్చి 'పుష్ప-2'లోనూ నటించిన సౌరభ్ సచ్‌దేవా పేరునూ పరిశీలిస్తున్నాడు. కానీ ఫాహద్ చేస్తే ఈ సినిమా క్రేజే వేరుగా ఉంటుంది. మరి అతను డేట్లు సర్దుబాటు చేస్తాడా లేదా అన్నదే చూడాలి.

# మన దేశంలో ఏం జరిగిందో ఐసీసీకి కూడా తెలిసే ఉంటుంది.

## - పాకిస్తాన్‌తో మ్యాచ్‌ల పై బీసీసీఐ స్పందన

**ముంబై :** ఇటీవల జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ కోసం కూడా పాకిస్తాన్ కు టీమిండియా వెళ్లలేదు. అయితే భారత్, పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు మాత్రం అప్పుడప్పుడు రెండు టీమ్‌ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగాలని వ్యాఖ్యానిస్తుంటారు. అలాంటి వారికి పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో బీసీసీఐ స్ట్రాంగ్ మెసేజ్ ఇచ్చింది. భారత్, పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌లకు ఉండే ఆదరణే వేరుగా ఉంటుంది. అయితే ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో 2012 నుంచి భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదు. కేవలం ఐసీసీ ఈవెంట్లలో తటస్థ వేదికల పైనే రెండు జట్లు తలపడుతున్నాయి. ఇటీవల జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ కోసం కూడా పాకిస్తాన్‌కు టీమిండియా వెళ్లలేదు. అయితే భారత్, పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు మాత్రం అప్పుడప్పుడు రెండు టీమ్‌ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగాలని వ్యాఖ్యానిస్తుంటారు. అలాంటి వారికి పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో బీసీసీఐ స్ట్రాంగ్ మెసేజ్ ఇచ్చింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో బీసీసీఐ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో ఎప్పుడూ పాకిస్తాన్ తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడేది లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పష్టం చేశారు. ఈ విషయం పై ఐసీసీ కూడా ఆలోచన చేయాలని రాజీవ్ పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఉగ్రదాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం, బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం. కేంద్ర ప్రభుత్వం ఏది చెబితే అదే చేస్తాం, ఇక పై పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడేది లేదు అని రాజీవ్ శుక్లా స్పష్టం చేశారు.ఐసీసీ ఈవెంట్ల విషయానికి వచ్చే సరికి ఐసీసీ నియమాలను గౌరవిస్తూ తటస్థ వేదికల్లో పాకిస్తాన్ తో ఆడుతున్నామని, అయితే మన దేశంలో తాజాగా జరిగిన ఘటన పై ఐసీసీ కి అవగాహన ఉందని అనుకుంటున్నానని రాజీవ్ శుక్లా వ్యాఖ్యానించారు. కాగా, పహల్గాం ఉగ్రదాటి ఘటనను ఎంతో మంది క్రికెటర్లు ఖండించారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన మ్యాచ్‌కు ముందు ఇరు జట్ల ఆటగాళ్లు మౌనం పాటించారు. అలాగే చేతులకు నల్ల రిబ్బన్లు కట్టుకుని మ్యాచ్ ఆడారు.




# మరో ఉత్కంఠ భరిత మ్యాచ్‌లో రాజస్తాన్ బోల్తా

**బెంగళూరు:** ఉత్కంఠ భరిత మ్యాచ్‌లో రాజస్తాన్ బోల్తా పడింది. ఎప్పటిలాగానే ఒత్తిడి తలొగ్గి పరాజయం పాలైంది. చివరి వరకు పోరాడి ఓడిపోవడం రాజస్తాన్ కు వరుసగా ఇది మూడోసారి. ఇక, ఎట్టకేలకు స్వంత మైదానం అయిన బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మెరిసింది. ఉత్కంఠభరిత మ్యాచ్‌లో రాజస్తాన్ బోల్తా పడింది. ఎప్పటి లాగానే ఒత్తిడి తలొగ్గి పరాజయం పాలైంది. చివరి వరకు పోరాడి ఓడిపోవడం రాజస్తాన్ కు వరుసగా ఇది మూడోసారి ఓటమి. ఈ సీజన్‌లో స్వంత మైదానంలో ఆర్సీబీకి ఇదే తొలి విజయం. కింగ్ కోహ్లీ (70) మరోసారి చెలరేగడంతో పాటు దేవ్‌దత్ పడిక్కళ్ (50) హాఫ్ సెంచరీ చేయడంతో ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. రాజస్తాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 194 పరుగులు మాత్రమే చేయగలిగింది. టాస్ గెలిచిన ఆర్‌ఆర్ కెప్టెన్ రియాన్ పరాగ్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో ఆర్సీబీ బ్యాటింగ్‌కు దిగింది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించడంతో ఆర్సీబీ బ్యాటర్లు చెలరేగారు. కోహ్లీతో పాటు ఫిల్ సాల్ట్ (26) కూడా వేగంగా ఆడి తొలి వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. హసరంగా బౌలింగ్‌లో సాల్ట్ అవుట్ అయిన తర్వాత వచ్చిన పడిక్కళ్ (50) హాఫ్ సెంచరీ చేశాడు. కోహ్లీ, పడిక్కళ్ రెండో వికెట్‌కు 95 పరుగులు జోడించారు. వేగంగా ఆడే క్రమంలో ఆర్చర్ బౌలింగ్‌లో కోహ్లీ అవుటైన తర్వాత టిమ్ డేవిడ్ క్రీజులోకి వచ్చాడు. ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. 206 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్‌ఆర్‌కు అద్భుత ఆరంభం లభించింది. యశస్వి జైస్వాల్ (49) మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వైభవ్ సూర్యవంశీ (16) తో కలిసి తొలి వికెట్‌కు 52 పరుగులు జోడించాడు. వీరిద్దరూ అవుట్ అయిన తర్వాత నితీష్ రాణా (28), రియాన్ పరాగ్ (22) నెమ్మదిగా ఆడారు. ఆ తర్వాత వచ్చిన ధ్రువ్ జురెల్ (47) మ్యాచ్‌ను గెలిపించే ప్రయత్నం చేశాడు. అయితే ఒత్తిడికి లోనై అవుట్ అయ్యాడు. 19వ ఓవర్ వేసిన ఆర్సీబీ బౌలర్ హాజెల్‌వుడ్ మ్యాచ్‌ను ఆర్‌ఆర్‌కు దూరం చేశాడు. దీంతో ఆర్‌ఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 194 పరుగులు మాత్రమే చేయగలిగింది.



"PEN SATTA" Telugu Daily Printed, Published and owned by CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Published at D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. and Printed at Chaitanya Vaaradhi Printers, Do.No.2-99, Bharinikam, Paravada, Anakapalli, Visakhapatnam-531 021. Editor : CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Cell : 98853 15759, RNI.NO.APTEL/2023/87729, E-mail:anilchintamaneni@gmail.com